సోమవారం
11-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 259
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

13 మంది అదనపు జడ్జిలకు పదోన్నతి

ఏపీ హైకోర్టులో ఇద్దరు, పంజాబ్, హర్యానా కోర్టులో 10 మంది

న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో శాశ్వత న్యాయమూర్తులుగా 13 మంది అదనపు జడ్జిలు ఆదివారం పదోన్నతి పొందారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి ఇద్దరు, పంజాబ్, హర్యానా హైకోర్టులో 10 మంది న్యాయమూర్తులు శాశ్వత జడ్జిలుగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తిని మధ్యప్రదేశ్ హైకోర్టు శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందారు. ఈ పదోన్నతులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ 'ఎక్స్'లో ప్రకటించారు. అదనపు జడ్జిలను సాధారణంగా రెండేళ్ల కోసం నియమితులవుతారు.

ప్రైవేట్ జెట్‌లు హెలికాప్టర్లకు డిమాండ్

- లోక్‌సభ ఎన్నికల్లో విహంగాలతో విస్తృత ప్రచారం!
- గతంలో రూ.250 కోట్లకు పైగా ఖర్చు చేసిన బీజేపీ

న్యూఢిల్లీ :
సార్వత్రిక ఎన్నికల వేళ విహంగాల ద్వారా విస్తృత ప్రచారం చేసేందుకు నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. పోటాపోటీగా జరిగే రాజకీయ సభలకు వేగంగా చేరుకునేందుకు, ఒక్క రోజులోనే వీలైనన్ని ఎక్కువ సభల్లో పాల్గొని ప్రజలకు తమ వాణిని వినిపించేందుకు ప్రధాన పార్టీల నాయకులు సమాయత్తమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోరాడేందుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్న తరుణంలో గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్ల డిమాండ్ 40 శాతం వరకు పెరగవచ్చని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. హెలికాప్టర్లు తక్కువ సమయంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు చేరుకునేందుకు సహాయపడతాయి. అందువల్ల విమానాలతో పోలిస్తే హెలికాప్టర్లకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. 'ప్రైవేట్ జెట్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఇది చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్ల లభ్యతను మించి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్ల సరఫరా పరిమిత స్థాయిలో ఉంది' అని క్లబ్ వన్ ఎయిర్ సీఈవో రాజన్ మెహ్రా పీటీఐకి తెలిపారు. పెరిగిన డిమాండ్‌తో సార్వత్రిక ఎన్నికల సమయంలో కొంతమంది ఆటగాళ్లు చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్‌లను లీజుకు తీసుకోనున్నారు. ఈ

- మిగతా 2 లో

రైల్ రోకో విజయవంతం

- పట్టాలపై రైతుల బైఠాయింపు
- 100కుపైగా రైళ్లకు అంతరాయం
- పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లో అరెస్టులు
- డిమాండ్లు పరిష్కరించే వరకు పోరు ఆగదు: పంధేర్, దల్లేవాల్

న్యూఢిల్లీ:
దీర్ఘకాలంగా తమ సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, గళాన్ని వినిపించుకోని పాలకలకు తాము కనిపించాలి, వినిపించాలనే దేశవ్యాప్తంగా రైల్ రోకోను రైతులు ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. నిరసన క్రమంలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. భారతీ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రాహన్), బీకేయూ (దకౌండా-ధనేర్), బీకేయూ (మాల్వా), బీకేయూ (దోబా), క్రాంతికారీ కిసాన్ యూనియన్, కిసాన్ జమ్హూర్ సంఘర్ష్ కమిటీ తదతర రైతు సంఘాలు ఆందోళనలో పాల్గొన్నాయి. దేశవ్యాప్తంగా రైల్ రోకో విజయవంతమైందని రైతు నాయకులు సర్వర్ సింగ్ పంధేర్, జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ప్రకటించారు. తమ డిమాండ్ల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టేంత వరకు తమ పోరు ఆగబోదని తేల్చిచెప్పారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) అధ్వర్యంలో రైతుల రైల్‌రోకో దేశవ్యాప్తంగా విజయవంతమైంది. పంజాబ్‌లో 75 ప్రాంతాల్లో, హర్యానాలో ఐదు చోట్ల, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో చెరో మూడు, తమిళనాడులో 20 ప్రాంతాల్లో రైల్‌రోకో పెద్దఎత్తున జరిగింది. దీంతో 100కుపైగా రైళ్లకు అంతరాయం కలిగింది. పంజాబ్‌లోని 22 జిల్లాలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఫిరోజ్‌పూర్ నుంచి భటిండా, జలంధర్ నుంచి హోషియార్పూర్, జలంధర్ నుంచి పఠాన్‌కోట్‌కు వెళ్లే రైళ్లతో పాటు అనేక రైళ్లు రద్దు అయ్యాయి. మరోవైపు పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లో అరెస్టుల పర్వం కొనసాగింది. హర్యానాలోని నిరసన స్థలాలకు వెళ్లే రైతులను పోలీసులు అడ్డుకున్నారు. దాబ్‌వలి, ఎల్లనాబాద్‌లో రైతులను నిర్బంధించారు. రాజస్థాన్‌లోని దౌసాలోనూ అరెస్టులు జరిగాయి. రాజస్థాన్‌లోని పిలిబంగా, తమిళనాడులోని తంజావూరు, మధ్యప్రదేశ్‌లోని ఝూబ్బాతో పాటు అనేక ప్రాంతాల్లో రైళ్లను రైతులు నిలువరించారని కేఎంఎం సమన్వయకర్త సర్వర్ సింగ్ పంధేర్ తెలిపారు. ఆదాయ హామీని దేశంలోని రైతులందరూ కోరుకుంటుంటే అది కల్పించకుండా మోదీ సర్కార్ ముఖం చాటేస్తోందని దల్లేవాల్ వ్యాఖ్యానించారు. 144 సెక్షన్ అమలు చేసి, పోలీసులతో దర్యాప్తు పేరిట రైతులను బెదిరిస్తున్నారని హర్యానా ప్రభుత్వాన్ని బీకేయూ-షరీద్ భారత్ సింగ్ అధికార ప్రతినిధి తేజ్‌వీర్ సింగ్ దుయ్యబట్టారు. సోమవారం విచారణకు హాజరు కావాలని తనకూ నోటీసులు అందినట్లు చెప్పారు. తనపై ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. ఏదో ఒక విధంగా రైతుల గొంతు నొక్కేందుకు హర్యానా ప్రభుత్వం

- మిగతా 2 లో

ఆస్ట్రేలియాలో హైదరాబాద్ మహిళ దారుణ హత్య

భర్తే హంతకుడు

హైదరాబాద్:
హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఆస్ట్రేలియాలో దారుణ హత్యకు గురయ్యారు. ఆమె మృతదేహాన్ని బక్లీలోని రోడ్డు పక్కన గల ఓ చెత్త డబ్బాలో అక్కడి పోలీసులు గుర్తించారు. అయితే భర్తే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆస్ట్రేలియాలోని బక్లీలో తెలంగాణకు చెందిన చైతన్య మాధగాని అలియాస్ శ్వేత మృతదేహం రోడ్డు పక్కనే ఉన్న ఓ చెత్త డబ్బాలో పోలీసులు గుర్తించారు. ఆస్ట్రేలియా మిర్కావే పాయింట్ కుక్‌లో భర్త వరికుప్పల అశోక్‌రాజ్‌తో కలిసి శ్వేత నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె చెత్త డబ్బాలో శవమై కనిపించింది. శ్వేత మృతిపై కేసు నమోదు చేసుకున్న విక్టోరియా పోలీసులు

- మిగతా 2 లో

పొత్తులతో బాబు... ప్రజలతో నేను

- ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధం: సీఎం జగన్
- బాబుకు ఓటేస్తే... పథకాలు పోతాయ్
- త్వరలో వైసీపీ మేనిఫెస్టో విడుదల చేస్తామని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల:
రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో పొత్తులతో చంద్రబాబునాయుడు, ప్రజలతో కలిసి జగన్ అను నేను తలపడబోతున్నామని వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం సిద్ధం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుత... బిందువు, బిందువు సింధువు అయినట్లుగా నా మీద, పార్టీ మీద నమ్మకంతో ప్రజలంతా సిద్ధం

- మిగతా 2 లో

తొక్కిసలాట

ఊపిరాడక పారిశుద్ధ్య కార్మికుడి మృతి

2లో

వైసీపీ ప్రచార అగచాట్లు!

- 'సిద్ధం' సభల ప్రభావం
- పోలీసుల అవస్థలు
- ప్రయాణికుల పాట్లు
- భారీగా ఆర్టీసీ బస్సుల తరలింపు
- ఎల్ఈడీ స్క్రీన్లు, ర్యాంపులతో హడావుడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సిద్ధం సభల పేరుతో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్న విమర్శలున్నాయి. ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకుగాను ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సిద్ధం సభలు ఎట్టకేలకు ముగిశాయి. దీంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. సిద్ధం సభల బందోబస్తుకు వేలాది మంది పోలీసులు వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది. ఒక వైపు ఏపీఎస్ఆర్టీసీ బస్సులను, మరో వైపు పెద్దఎత్తున పోలీసు బలగాలను ఉపయోగించడం విమర్శలకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సమన్యాయమంటే మా కులంలో డబ్బున్నోడికి,మీకు అణిగిమణిగి ఉండే వారికి టికెట్టివ్వడమే కదా, దొరా!?

రాజ్యాంగ వినాశనమే బీజేపీ, ఆర్ఎస్ఎస్ లక్ష్యం

- కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ విమర్శ
- మోదీ మనస్సులో మాట బయట పెట్టిన బీజేపీ ఎంపీ

న్యూఢిల్లీ:
భారత రాజ్యాంగాన్ని సవరించి, అందులో 'సెక్యూలర్' పదం లేకుండా చేసేందుకు బీజేపీకి మూడొంతుల మెజారిటీ వస్తేనే సాధ్యమని బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హేగ్డే అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో బీజేపీకి మెజారిటీ ఉంటే రాజ్యాంగాన్ని సవరించవచ్చని, హిందూ సమాజాన్ని అణచివేసే చట్టాలను రద్దు చేయెుచ్చని తెలిపారు. ఇదంతా జరగాలంటే లోక్‌సభలో కాంగ్రెస్ ఉండరాదని హేగ్డే అన్నారు. లోక్‌సభలో 400కుపైగా స్థానాల్లో గెలిస్తే పార్లమెంటు ఉభయ సభలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలపైనా ఆధిక్యత ఉంటుందని, తద్వారా అనుకున్న విధంగా రాజ్యాంగాన్ని సవరించవచ్చని బీజేపీ ఎంపీ ఉద్ఘాటించారు. హెగ్డే వ్యాఖ్యలను ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ఖండించింది. రాజ్యాంగాన్ని తిరగరాయడం,

- మిగతా 2 లో

అరుణ్ గోయెల్ రాజీనామా సంగతేంటి?

- మోదీ సర్కార్‌ను నిలదీసిన ప్రతిపక్షాలు
- మూడు ప్రశ్నలు లేవనెత్తిన కాంగ్రెస్
- కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలి: సీపీఎం



న్యూఢిల్లీ :
కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ రాజీనామాపై ప్రతిపక్షాలు ఆదివారం మోదీ ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) లేదా నరేంద్ర మోదీ ప్రభుత్వంతో ఏమైనా విభేదాల వల్ల ఆయన అలా చేశారా అని ప్రశ్నించాయి. ఎన్నికల కమిషనర్ పదవికి అరుణ్ గోయెల్ శనివారం సాయంత్రం రాజీనామా చేయడంపై కాంగ్రెస్ పార్టీ మూడు ప్రశ్నలను లేవనెత్తింది. 'ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో విభేదాల కారణంగా లేదా స్వతంత్ర సంస్థగా భావించే అన్ని సంస్థలకు ముందు సీటులో డ్రైవింగ్ చేసే మోదీ ప్రభుత్వంతో విభేదాల కారణంగా ఆయన నిజంగా రాజీనామా చేశారా? లేదా వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారా? లేదా కొద్దిరోజుల క్రితం కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి లాగానే ఆయన కూడా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసేందుకు రాజీనామా చేశారా?' అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జైరాం రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ తారుమారును నిరోధించడానికి చాలా అవసరం అయిన ఓటరు ధ్రువీకరించదగిన పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) అంశంపై 'ఇండియా' కూటమి పార్టీలతో సమావేశానికి ఎన్నికల సంఘం ఎనిమిది నెలలుగా నిరాకరించిందని కాంగ్రెస్ నాయకుడు తెలిపారు. 'భారతదేశంలో గడిచిన ప్రతి రోజు ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య సంస్థలకు దెబ్బ తగిలింది' అని కూడా ఆయన అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గేను గోయెల్ రాజీనామా గురించి అడిగినప్పుడు ఆయన పెద్దగా

- మిగతా 2 లో

కాటలన్ ఆమ్నెస్టీ చట్టానికి వ్యతిరేకంగా

మాడ్రిడ్‌లో భారీ ప్రదర్శన

స్పెయిన్, ఈయూ జెండాలతో పాల్గొన్న వేలాది మంది

మాడ్రిడ్: కటాలన్ ఆమ్నెస్టీ బిల్లుకు వ్యతిరేకంగా స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో భారీ ప్రదర్శన జరిగింది. స్పెయిన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) జెండాలు చేబూని వేలాది మంది కదం తొక్కారు. జాతీయ పతాకాలు ప్రదర్శిస్తూ, దేశభక్తి గీతాలు పాడుతూ నిరసన వ్యక్తంచేశారు. కటాలన్ వేర్పాటువాదులకు సంబంధించిన ఆమ్నెస్టీ బిల్లుకు వ్యతిరేకంగా పౌర సంఘాల పిలుపు మేరకు ప్రధాని పెడ్రో సాన్‌చెజ్ విధానాలకు నిరసనగా ఈ ప్రదర్శన జరిగింది. స్పెయిన్‌లో అధికార సోషలిస్ట్ వర్కర్స్ పార్టీ (పీఎస్ఓఈ) ఈనెల 7న రెండు కటాలన్ పార్టీలతో ఒప్పందం చేసుకుంది. దీనిప్రకారం ఈనెలాఖరుకల్లా పార్లమెంటులో ముసాయిదా చట్టాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. కాగా, ఆమ్నెస్టీ బిల్లుకు వ్యతిరేకంగా భారీస్థాయిలో ప్రదర్శనలు, నిరసనలు జరుగుతూనే ఉన్నాయి. కన్జర్వేటివ్ పీపుల్స్ పార్టీ (పీపీ), వోక్స్‌తో పాటు సోషలిస్టు పార్టీలోని కొన్ని వర్గాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. పెడ్రో మళ్లీ ప్రధాని అయ్యేందుకు మద్దతివ్వడానికి బదులుగా ఆమ్నెస్టీ బిల్లును ప్రవేశపెట్టేలా కటాలన్ వేర్పాటువాద పార్టీలతో సోషలిస్టులకు ఒప్పందం కుదిరింది.

పాక్ 14వ అధ్యక్షుడు జర్దారీ

అధ్యక్ష భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ 14వ అధ్యక్షుడిగా ఆసిఫ్ అలీ జర్దారీ నియమితులయ్యారు. ఆచప ఆదివానం నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. పాకిస్థాన్ ప్రధాన న్యాయమూర్తి ఖాజీ ఫయీజ్ ఈసా అధ్వర్యంలో అధ్యక్ష భవనంలో జర్దారీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. దేశ తొలి పౌరుడిగా రెండవసారి ఎన్నికై ఆసిఫ్ అలీ జర్దారీ చరిత్ర సృష్టించారని 'ఎక్స్'లో ఆయనకు చెందిన పీపీపీ పేర్కొంది. కాగా, జర్దారీకి అధిక ఓట్లు వచ్చినట్లు పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ శనివారం ప్రకటించింది. ఎలక్టోరల్ కాలేజీలు (పార్లమెంటుతో పాటు నాలుగు ప్రావిన్షియల్ అసెంబ్లీలు కలిపి) నుంచి జర్దారీకి మొత్తం 411 ఓట్లు వచ్చినట్లు తెలిపింది. పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో 255 ఓట్లు రాగా తూర్పు పంజాబ్ ప్రావిన్స్ నుంచి 43, వాయువ్య ఖైబర్ పంఖ్‌తుంఖ్వా నుంచి ఎనిమిది, నైరుతి బలూచిస్థాన్ ప్రావిన్స్ నుంచి 47, దక్షిణ సింధ్ ప్రావిన్స్ నుంచి 58 చొప్పున ఓట్లు వచ్చినట్లు కమిషన్ వెల్లడించింది. జర్దారీ ప్రత్యర్థి మహమూద్ ఖాన్ (విపక్షాల ఉమ్మడి అభ్యర్థి)కి 181 ఓట్లు వచ్చినట్లు ఈసీ పేర్కొంది. దీంతో జర్దారీ (68) రెండవ సారి పాకిస్థాన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని ప్రకటించింది. జర్దారీ 2008 నుంచి 2013 వరకు దేశానికి 11వ అధ్యక్షుడిగా ఉన్నారు.

నేపాల్ కేబినెట్ మళ్లీ విస్తరణ

కొత్తగా ఇద్దరికి మంత్రి పదవులు - 13న బలపరీక్ష!

ఖాట్మండు: నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ (ప్రచండ) ఆదివారం తన కేబినెట్ విస్తరణను మరోమారు చేపట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కేబినెట్‌లోకి ఇద్దరికి స్థానం కల్పించారు. జనతా సమాజ్‌వాదీ పార్టీ చైర్మన్ ఉపేంద్ర యాదవ్ ఉప ప్రధానిగా, ఆరోగ్యశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా ఇదే పార్టీకి చెందిన మరో నేత నవల్ కిశోర్ సాహ్ సుదీ అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటన చేసింది. నేపాలీ కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకొని సీపీఎన్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్)తో పాటు మరో రెండు పార్టీలతో కలిసి కొత్త ప్రభుత్వాన్ని ప్రచండ ఏర్పాటు చేశారు. 20 మందికి కేబినెట్ పదవులు ఇచ్చారు. కొత్తగా మరో ఇద్దరికి స్థానం కల్పించారు. ఇంకో ముగ్గురి కూడా నియమించేందుకు ఆయనకు అవకాశముంది. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు సెంటర్) చైర్మన్ దహల్ ఈనెల 13న అంటే బుధవారం బలపరీక్ష ఎదుర్కోనున్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత విశ్వాస ఓటుకు వెళ్లడం ఇది మూడవసారి. దీంతో తమ పార్టీ నేతలకు సీపీఎన్ (మావోయిస్ట్ సెంటర్) విప్ జారీ చేసింది. నేషనల్ అసెంబ్లీ చైర్మన్ ఎన్నిక, ప్రచండ బల పరీక్ష ఉండటంతో ఖాట్మండును వీడొద్దని తేల్చిచెప్పింది. పార్లమెంటు దిగువ సభ, ప్రతినిధుల సభ ఈనెల 13న సమావేశం కానున్నాయి. సభ్యులంతా తప్పక హాజరు కావాలని విప్ పేర్కొంది. కొత్త సంకీర్ణ ప్రభుత్వానికి తమ బలాన్ని నిరూపించుకునేందుకు సరిపడ సంఖ్యాబలం ఉన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది.ఎగువ సభ చైర్మన్ ఎన్నిక ఈనెల 12న జరగాల్సి ఉందని వెల్లడించింది.

హెలికాప్టర్లకు డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

లీజుకు తీసుకున్న హెలికాప్టర్ల తేదీలను రానున్న రోజుల్లో ప్రకటించవచ్చు. ఇదిలాఉండగా, చార్టర్డ్ విమానం, హెలికాప్టర్ సేవలను గంట ప్రాతిపదికన వసూలు చేస్తారు. చార్టర్డ్ విమానం ధర గంటకు రూ.4.5 లక్షల నుంచి రూ. 5.25 లక్షల మధ్య మారవచ్చని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడ్డారు. హెలికాప్టర్‌కు గంటకు దాదాపు రూ.1.5 లక్షల వరకు వసూలు చేస్తారు. బిజినెస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ (బీఏవోఏ) మేనేజింగ్ డైరెక్టర్ కెప్టెన్ ఆర్.కె.బాలీ పీటీఐతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రైవేట్ చార్టర్డ్ విమానాలు, హెలికాప్టర్లకు గత ఎన్నికలతో పోలిస్తే 30 నుంచి 40 శాతం డిమాండ్ పెరుగుతుందని అంచనా. డిసెంబరు 2023 చివరి నాటికి 112 నాన్-షెడ్యూల్డ్ ఆపరేటర్లు (ఎన్ఎస్‌వోపీలు) ఉన్నారని అధికారిక గణాంకాలు పేర్కొన్నాయి. సాధారణంగా ఎన్ఎస్‌వోపీలు నిర్దిష్ట నిర్ణీత షెడ్యూల్ లేని సంస్థలు, అవసరమైనప్పుడు ఎగురుతాయి. డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నేతలు చార్టర్డ్ కార్యకలాపాల కోసం విమానాలను ముఖ్యంగా హెలికాప్టర్లను లీజుకు తీసుకోవాలని భావిస్తున్నారు. దాదాపు 111-112 ఎన్ఎస్‌వోపీలు ఉన్నాయని, అయితే వాటిలో 40-50 శాతం ఒకే విమానాలను నడుపుతున్నాయని బాలి చెప్పారు. ఎన్ఎస్ఓపీలో హెలికాప్టర్లు సహా దాదాపు 450 విమానాలు ఉంటాయని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆపరేటర్లు విమానాలు, హెలికాప్టర్లను కలిగి ఉన్నారు. సీట్ల సామర్థ్యం 3 నుంచి 37 వరకు ఉంటాయి. విమానాలలో ఫాల్కన్ 2000, బొంబార్డియర్ గ్లోబల్ 5000, ట్విన్ ఓటర్ డీహెచ్‌సీ-6-300, హాకర్ బీచ్‌క్రాఫ్ట్, గల్ఫ్‌స్ట్రీమ్ జీ-200, సెస్నా సైటేషన్ 560ఎక్స్ఎల్ ఉన్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వివరాలు పేర్కొంటున్నాయి. చాలా విమానాలు, హెలికాప్టర్లు 10 కంటే తక్కువ సీట్ల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని వెల్లడించింది. చార్టర్డ్ ఫ్లీట్ పరిమాణం దాదాపు 350 ఉంటుందని, వాటిలో 175 హెలికాప్టర్లు ఉన్నాయని మెహ్రా చెప్పారు. చార్టర్డ్ ఆపరేటర్, క్లబ్ వన్ ఐదు ఫాల్కన్ 2000, నాలుగు సెస్నా సైటేషన్, ఒక బొంబార్డియర్ సీఆర్‌జే 200 విమానాలను కలిగి ఉంది. 'రాజకీయ నాయకులు చిన్న పట్టణాలకు వెళ్లడానికి హెలికాప్టర్లను ఎంచుకుంటారు. అందువల్ల హెలికాప్టర్లకు మరింత డిమాండ్ ఉండవచ్చు' అని మెహ్రా చెప్పారు. ఈ రంగంలో చాలా మంది బ్రోకర్లు ఉన్నారని, కొన్నిసార్లు వారు చార్టర్డ్ విమానం కోసం నిర్దిష్ట సంఖ్యలో గంటలను బుక్ చేసుకుంటారని తెలిపారు. ఆ తరువాత ఆ గంటలను రాజకీయ పార్టీలతో సహా తుది వినియోగదారులకు విక్రయిసారని మెహ్రా వివరించారు. బాలి మాట్లాడుతూ ఇక్కడ చాలా మంది బ్రోకర్లు చార్టర్డ్ విమాన సేవలను అందిస్తున్నారని, గంట ధర కూడా చర్చలపై ఆధారపడి ఉంటుందని, సాధారణంగా గంటల ఆధారంగా పెద్దమొత్తంలో బుక్ అవుతాయన్నారు. ఈసారి భారీ డిమాండ్ ఉందని, కొంతమంది విమానాలు, హెలికాప్టర్లను లీజుకు తీసుకుంటున్నారని, రాబోయే ఎన్నికల కోసం హెలికాప్టర్ల గంట ధరలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. అయితే చార్టర్డ్ హెలికాప్టర్లను గంటకు దాదాపు రూ.1.5 లక్షల చొప్పున అద్దెకు తీసుకుంటారు. కొన్ని సందర్భాల్లో గంట ధరలు రూ.3.5 లక్షలకు చేరుకుంటున్నాయని వివరించారు. స్థూలంగా చార్టర్డ్ విమానం ధర గంటకు రూ.4.5 లక్షల నుంచి రూ.5.25 లక్షల మధ్య ఉంటుందని మెహ్రా చెప్పారు.

వందల కోట్లలో ప్రధాన పార్టీల ఖర్చు

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కి సమర్పించిన 2019-20 సంవత్సరానికి పార్టీ వార్షిక ఆడిట్ చేసిన ఖాతాల ప్రకారం, అధికార బీజేపీ విమానాలు, హెలికాప్టర్లపై మొత్తం రూ.250 కోట్లకు పైగా ఖర్చు చేసింది. 2019-20లో ఎన్నికల ప్రయాణ ఖర్చుల కోసం కాంగ్రెస్ పార్టీ వెచ్చించిన మొత్తం రూ.126 కోట్లకు పైగా ఉంది. పార్టీ ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆడిట్ చేసిన ఖాతాలలో విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులను ప్రత్యేకంగా పేర్కొనలేదు. చివరి లోక్‌సభ ఎన్నికలు 2019 ఏప్రిల్, మేలో జరిగాయి. ప్రముఖ ఎన్నికల విశ్లేషకుడు ఎన్.భాస్కరరావు ప్రకారం, రాబోయే లోక్‌సభ ఎన్నికలలో మొత్తం వ్యయం దాదాపు రూ.1.20 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. '2024 లోక్‌సభ ఎన్నికల వ్యయం ఒక్కటే దాదాపు లక్షా ఇరవై వేల కోట్లను కలిగి ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం దాదాపు 20 శాతం (కొత్త ఈవీఎంల ఖర్చు చేర్చలేదు) ఖర్చు చేస్తుందని అంచనా' అని ఆయన వివరించారు. అయితే కరోనా మహమ్మారి నుంచి ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్లకు డిమాండ్ స్థిరంగా ఉంది. ప్రజలు ప్రధానంగా పరిశుభ్రత, భద్రతాపరమైన అంశాలను చూస్తున్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

దాని వినాశనమే బీజేపీ-ఆర్ఎస్ఎస్ లక్ష్యమని, మత అజెండాతో ముందుకెళుతూ లౌకికవాదాన్ని అంతం చేయాలని చూస్తోందని దుయ్యబట్టింది. హెగ్డే వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలతో సంఘ్ పరివార్, ప్రధాని మోదీ రహస్య అజెండా బహిర్గతమైందన్నారు. నిరంకుశత్వమే మోదీ-ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నదని మరోమారు రుజువైందని ఖడ్గే నొక్కిచెప్పారు. మనువాదాన్ని అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులను కాలరాయాలని చూస్తోందని, నియంత పాలనను ఆపాదించాలన్న కోరుకుంటోందని దుయ్యబట్టారు. 'బీజేపీ తిరిగి గెలిస్తే మళ్లీ ఎన్నికలంటూ జరగవు. ఒక వేళ జరిగినా అవి నామమాత్రంగా ఉంటాయి. సంస్థల స్వయంప్రతిపత్తి అంతమవుతుంది. భావ ప్రకటన స్వేచ్ఛ కాలరాయబడుతుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ సర్వనాశనం చేస్తాయి' అని 'ఎక్స్'లో ఖడ్గే వ్యాఖ్యానించారు.

సంఘ్ పరివార్ దుష్ట లక్ష్యాలు నెరవేరనివ్వబోమని, వీటిని కాంగ్రెస్ ప్రతిఘటిస్తుందని ఉద్ఘాటించారు. సార్వభౌమత్వం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రాజ్యాంగ నిర్మాతలు మనకు అందిస్తే వాటిపై ప్రత్యక్ష దాడులను బీజేపీ-ఆర్ఎస్ఎస్ చేస్తున్నాయని ఆరోపించారు. న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ మన రాజ్యాంగానికి మూల స్థంభాలని, ఈ సిద్ధాంతాల్లో ఎలాంటి మార్పు జరిగినా అది అంబేద్కర్‌తో పాటు మహానేతల దార్శనికతను అవమానించడమే అవుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యతని ఖడ్గే నొక్కిచెప్పారు. హ్యాష్‌ట్యాగ్ 'సంవిధాన్ బచావో, బీజేపీ హఠావో'తో ట్వీట్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కలలను కల్లలు చేసే కుట్రలను తిప్పికొట్టాలని రాహుల్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యబద్ధ హక్కులను కాపాడేందుకు తుది శ్వాస వరకు పోరాడతామన్నారు. 'రాజ్యాంగ సైనికులు ముఖ్యంగా దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గీయులు, మైనారిటీలు మేల్కొనాలి, గొంతెత్తాలి. 'భారత్' మీ వెంటే ఉంది' అని ఎక్స్‌లో 'సంవిధాన్ బచావో, బీజేపీ హఠావో' హ్యాష్‌ట్యాగ్‌తో రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే మోదీ సర్కార్‌ను గద్దె దించాల్సిందేనని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే, కర్నాటకలో బీజేపీ ఎంపీ హెగ్డే మాట్లాడుతూ 'ఈసారి 400కుపైగా స్థానాల్లో గెలుస్తామని ప్రధాని మోదీ చెప్పారు... లోక్‌సభలో మెజారిటీ ఉంది కానీ రాజ్యసభలో లేదు. రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ సముచిత మెజారిటీ లేదు. 400కుపైగా స్థానాలను గెలుచుకుంటే రాజ్యసభలోనూ మెజారిటీ వస్తుంది. కాంగ్రెస్ సంఖ్యాబలం పెరిగితే బీజేపీ ప్రభుత్వం చేసే రాజ్యాంగ సవరణలకు రాజ్యసభలో ఆమోదం లభించదు.

ఇందుకు పౌరసత్వ సవరణ చట్టమే (సీఏఏ) ఉదాహరణ. సీఏఏ అమలు కాకపోతే దేశద్రోహులు రెచ్చిపోతారు. లోక్‌సభలో 400 స్థానాల్లో గెలిస్తే 20కుపైగా రాష్ట్రాలు మన వద్దకు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ 2/3వ వంతు మెజారిటీ పొందుతాం. లోక్‌సభ, రాజ్యసభతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల్లో మెజారిటీ మనదే అయితే కావల్సిన మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు' అని అన్నారు. చట్టసభల్లో కాంగ్రెస్ లేకుండా చేయాలంటూ ప్రతిపక్షమే ఉండకూదన్న సందేశాన్ని హెగ్డే ఇచ్చారు.

రైల్ రోకో విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)



యత్నిస్తోందన్నారు. పట్టాలపై బైఠాయించి ఈ విధంగా ఆందోళనను ఇష్టంగా కాదు కష్టంగానే చేస్తున్నామని, తమ గోడు పాలకులకు తెలియాలంటే ఆందోళనలు తప్పడంలేదన్నారు. ఇదిలావుంటే శంభు సరిహద్దు వద్ద రైతుల ఆందోళన యధావిధిగా కొనసాగింది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు శంభు రైల్వే స్టేషన్‌కు చేరుకొని సుమారు నాలుగు గంటల పాటు ట్రాక్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. ఇంటర్‌సిటీతో పాటు ప్రధాన మార్గాల్లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఢిల్లీకి వెళ్లే అమృత్‌సర్ మార్గంలో దేవిదాస్‌పురా రైల్వేస్టేషన్ వద్ద నిరసనలో పంధేర్ పాల్గొన్నారు.

హైదరాబాద్ మహిళ దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

విచారణ చేపట్టారు. అయితే ఈ కేసులో విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది. మొదట ఎవరో దుండగులు శ్వేతను హత్య చేసి ఉంటారని భావించగా... భర్తే ఆ దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది. భార్యను హత్య చేసిన అశోక్ రాజ్... మృతదేహాన్ని చెత్తడబ్బాలో దాచి పెట్టాడు. అనంతరం కుమారుడితో కలిసి హైదరాబాద్ చేరుకున్న అతడు కొడుకును ఏఎస్ రావు నగర్‌లోని అత్తగారి ఇంట్లో వదిలాడు. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

శ్వేత మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందుకు బంధువులు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

వైసీపీ ప్రచార అగచాట్లు!

(మొదటిపేజీ తరువాయి)

దారితీసింది. ఒక్కో సిద్ధం సభా వేదికను 20 రోజుల నుంచి నెల రోజుల ముందే ప్లాన్ చేయడం, వాటి విజయవంతం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో లక్షలాది మంది పార్టీ శ్రేణులతో సిద్ధం చివరి సభను నిర్వహించారు. సభకు తిరుపతి, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు,గుంటూరు తదితర 6 జిల్లాలనుంచి శ్రేణుల్ని తరలించారు. ఈ సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా వై నాట్ 175 నినాదంతో ప్రత్యేకంగా వై ఆకారంలో ర్యాంప్ ఏర్పాటు చేశారు. ర్యాంప్ చివరన 75 అడుగుల ఎత్తులో వైసీపీ జెండాలను నిలిపారు. సభా ప్రాంగణంలో ఎక్కువ మంది వీక్షించేందుకుగాను భారీగా ఎల్ఈడీ స్క్రీన్లను ఉంచారు. ఒక్కో సిద్ధం సభలో ఒక్కో రకంగా ప్రచారాన్ని వైసీపీ తీర్చిదిద్దింది. తొలుత ఉత్తరాంధ్ర జిల్లాలోని భీమిలిలో జనవరి 27న సిద్ధం సభను నిర్వహించి, ఎన్నికల ప్రచారానికి జగన్ శంఖారావం పూరించారు. అనంతరం ఫిబ్రవరి 4న ఏలూరుజిల్లా దెందులూరులో రెండో సిద్ధం సభను ఏర్పాటు చేశారు. 18వ తేదీన మూడో సిద్ధం సభను అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించారు. ఈ మూడు సిద్ధం సభలు ఒకదానికి మించి, మరొకటి విజయవంతమయ్యేలా వైసీపీ ఆధిష్ఠానం చర్యలు చేపట్టింది. చివరి సిద్ధం సభ ముగియడంతో ఇక ఎన్నికల ప్రచారంపైనే సీఎం జగన్ దృష్టిపెట్టనున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టనున్నారని వైసీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి తెలిపారు. సిద్ధం సభలు పూర్తవ్వడంతో ఇక ప్రచారంపై సీఎం దృష్టి పెట్టారు.

బస్టాండ్లలో ప్రయాణికుల నిరీక్షణ

సిద్ధం సభలకు జనాన్ని చేరవేసేందుకు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను వినియోగించడంతో సాధారణ ప్రయాణాలకు సరిపడా బస్సులు లేక బస్టాండ్లలోనే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన స్థితి ఏర్పడింది. సిద్ధం సభలకు ప్రారంభం నుంచి పెద్దఎత్తున ఆర్టీసీ బస్సులను పెద్దఎత్తున తరలించారు. ఆయా ప్రాంతాల డిపోలు, స్టేషన్లలో పూర్తి స్థాయిలో బస్సులు కన్పించలేదు. మొదటి సిద్ధం సభ నుంచి చివరి సిద్ధం సభ వరకు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మేదరమెట్లలో జరిగిన చివరి సిద్ధం సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 3,500 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా ఆర్టీసీ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. భారీ స్థాయిలో బస్సులను తరలించడం వల్ల రోజు వారీ కార్మికులు, కూలీలు, ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులకు గురయ్యారు. నెల్లూరు జిల్లా నుంచి 360 బస్సులు, పల్నాడు 300, ప్రకాశం 290, ఎన్టీఆర్ నుంచి 270, గుంటూరు 225, కృష్ణా 170, బాపట్ల జిల్లా నుంచి 150 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. దీంతో బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు నరకం చూశారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

అటు ఆర్టీసీ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడింది. అద్దె పేరుతో ఆర్టీసీ బస్సులను తీసుకున్నప్పటికీ... సంస్థకు ప్రభుత్వం డబ్బు చెల్లించే పరిస్థితుల్లేవు. ఆర్టీసీ బస్సులన్నిటినీ సిద్ధం సభకు కేటాయించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులను పెద్దఎత్తున తరలించారు. బాపట్ల జిల్లా నుంచి దాదాపు 1200 మందిని సిద్ధం కోసం తరలించినట్లు తెలిసింది. దీంతో ఆయా పోలీస్‌స్టేషన్లు వెలవెలబోయాయి. ఈ తరహాగా ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించడంపై సర్వత్రా వ్యతిరేకత నెలకొంది.

గోయెల్ రాజీనామా సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడలేదు. 'రాబోయే రోజుల్లో ఆయన ఏమి చేస్తాడో వేచి చూడాల్సిందేనన్నారు. 'హైకోర్టు జడ్జి రాజీనామా చేసి మరుసటి రోజు బీజేపీలో చేరి టీఎంసీపై ఆరోపణలు చేయడం ప్రారంభించారు. బీజేపీ అలాంటి మనస్తత్వం ఉన్న వారిని పార్టీలో చేర్చుకుంటుందని ఇది తెలియజేస్తోంది. ఇప్పుడు ఎన్నికల కమిషనర్ రాజీనామా చేశారు. మరికొంత కాలం వేచి చూద్దాం' అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి కొన్ని రోజుల ముందు గోయెల్ శనివారం రాజీనామా చేశారు. ఆయన పదవీకాలం డిసెంబరు 5, 2027 వరకు ఉంది. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేసిన తర్వాత గోయెల్ సీఈసీ అవుతారు. గోయెల్ ఎందుకు రాజీనామా చేశారో వెంటనే తెలియరాలేదు. గోయెల్ పంజాబ్ కేడర్‌కు చెందిన 1985 బ్యాంచ్ ఐఏఎస్ అధికారి. నవంబరు 2022లో ఎన్నికల సంఘంలో చేరారు. ఫిబ్రవరిలో అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ, గోయల్ రాజీనామా తర్వాత, ముగ్గురు సభ్యుల కేంద్ర ఎన్నికల సంఘంలో ఇప్పుడు ఒకే ఒక సభ్యుడు సీఈసీ రాజీవ్ కుమార్ ఉన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ రాజీనామా చేయడం తమను ఆందోళనకు గురిచేస్తోందని, ఇందుకు తలెత్తిన పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గోయెల్ రాజీనామా వ్యవహారం అనిశ్చితి వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొంది. 'పదవీ విరమణకు మూడు సంవత్సరాలు మిగిలి ఉన్న ఎన్నికల కమిషనర్‌లలో ఒకరు రాజీనామా చేశారు. రాజీనామాను అధికారికంగా ఆమోదించారు. ఇప్పటికే ఒక కమిషనర్ స్థానం ఖాళీగా ఉండటంతో ఇది కమిషన్‌కు ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ అనే ఒకే సభ్యుడు ప్రాతినిధ్యం వహించే పరిస్థితిని సృష్టిస్తుంది' అని తెలిపింది. ఈ పరిస్థితి ఈ రాజ్యాంగ సంస్థ విశ్వసనీయతను, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించే సామర్థ్యంపై ఆందోళనలను లేవనెత్తుతుంది' అని వామపక్ష పార్టీ పేర్కొంది.

బీజేపీ ఒత్తిడికి లొంగని గోయెల్‌కు అభివాదం చేయండి : మమత

ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ పదవికి రాజీనామా చేసిన ఒక రోజు తర్వాత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదివారం బీజేపీ ఒత్తిడికి 'లొంగిపోనందుకు' గోయెల్‌ను ప్రశంసించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో కాషాయ శిబిరం ఓడిపోతుందని నొక్కి చెప్పారు. ఇక్కడ బ్రిగేడ్ పరేడ్ మైదానంలో జరిగిన టీఎంసీ భారీ బహిరంగ సభలో బెనర్జీ మాట్లాడుతూ గోయెల్ ఆకస్మిక రాజీనామా 'లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓట్లను కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తోంది' అని రుజువు చేస్తోందని తెలిపారు. 'పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బలగాల మోహరింపునకు సంబంధించి ఢిల్లీ నాయకులు (బీజేపీ), తన ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు లొంగనందుకు అరుణ్ గోయెల్‌కు నేను అభివాదం చేస్తున్నాను. ఎన్నికల పేరుతో వారు (బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం) ఏం చేయాలనుకుంటున్నారో రుజువైంది. ఓట్లను కొల్లగొట్టాలని చూస్తున్నారు' అని ఆమె అన్నారు. ఈసీ గోయెల్ రాజీనామాపై ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ వర్గాలు ప్రభుత్వాన్ని దుయ్యబట్టాయి. 'టీఎన్ శేషన్ హయాంలో ఎన్నికలకు కాపలాదారుగా పనిచేసి నిష్పక్షపాతంగా వ్యవహరించిన ఎన్నికల సంఘం ఇది కాదు. పదేళ్లలో ఎన్నికల కమిషన్‌ను ప్రైవేటీకరించారు. ఇది బీజేపీ శాఖగా మారింది. ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. సంఘంలో ఒక్కరే మిగిలారు.

హైకోర్టులు, సుప్రీం కోర్టు, గవర్నర్ హౌస్‌లలో బీజేపీ వ్యక్తులను నియమించినట్లే, ఇక్కడ కూడా తమ ఇద్దరు బీజేపీ వ్యక్తులను నియమిస్తారు' అని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని సేన (యూబీటీ) రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ విలేకరులతో అన్నారు. ఎన్‌సీపీ (శరద్‌చంద్ర పవార్) జాతీయ అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో మాట్లాడుతూ గోయెల్ ఆకస్మిక రాజీనామా అనుమానాస్పదంగా ఉందని అన్నారు. 'ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించరనే సందేహం వల్లే ఆయన రాజీనామా చేశారా? అందుకే వెళ్లిపోవాలని కోరారా? ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అని కోరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజీనామాపై గోయెల్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఏఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఇది ఆందోళనకర పరిణామమని స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్ అన్నారు. 'లోక్‌సభ ఎన్నికల ముంగిటలో ఇలా హఠాత్తుగా రాజీనామా చేయడం మనం ఆందోళన చెందాల్సిన విషయం. ఎందుకంటే సాధారణంగా ఇది జరగదు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్న కారణాలు వాస్తవమే కావచ్చు. కానీ, అది అసంభవం' అని సిబల్ అన్నారు. స్వేచ్ఛాయుత , నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్ధారించడానికి రాజ్యాంగబద్ధంగా బాధ్యత వహించే ఎన్నికల కమిషన్‌తో సహా ఈ దేశంలోని సంస్థలను 'నెమ్మదిగా నాశనం చేస్తున్నారు' అని సిబల్ విమర్శించారు.

ప్రజలతో నేను

(మొదటిపేజీ తరువాయి)

అంటూ ఉప్పెనలా తరలి రావటం సంతోషంగా ఉందన్నారు. జన ప్రవాహం మరో ఐదేళ్లు ఈ ప్రయాణాన్ని కొనసాగించేందుకు మద్దతు పలికేందుకు వచ్చిన ప్రజా సైన్యానికి సెల్యూట్ చేస్తున్నానని తెలిపారు. పేదవాడి భవిష్యత్తును కాపాడేందుకు మనంమంతా సిద్ధమవుతుంటే... జగన్‌ను ఓడించేందుకు అందరూ ఏకమవుతున్నారన్నారు. ఎన్నికల కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడి పాత్ర మీది అర్జునుడి పాత్ర నాది అని ప్రజలనుద్దేశించి అన్నారు. చంద్రబాబులా నాకు నటించే పొలిటికల్ స్టార్ క్యాంపెయినర్లు లేరని, అబద్ధాలకు రంగులు పూసే ఎల్లో మీడియా లేదన్నారు. ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్న నాకు నక్షత్రాలు ఎన్ని ఉన్నాయో అంత మంది స్టార్ క్యాంపెయినర్లు ప్రతి ఇంట్లో ఉన్నారని తెలిపారు. అధికారమంటే నాకు వ్యామోహం లేదని, అధికారం పోతుందనే భయం అసలు లేదన్నారు. చెసేదే చెప్తాం చెప్పామంటే చేస్తామన్నారు. హిస్టరీ బుక్‌లో జగన్ పేరు ఉండాలన్నదే కోరిక అని పేర్కొన్నారు. త్వరలోనే వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. జగన్ మాట ఇస్తే తగ్గేదే లేదు అన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామని... కరోనా లాంటి కష్టకాలంలో కూడా ఇచ్చిన హామీలు మరవలేదన్నారు. 2024 తర్వాత కూడా మనం చేస్తున్న మంచి కొనసాగాలని... భారం అంతా దేవుడి మీదేనని చెప్పారు. 2019కి ముందు మీకు మంచి భవిష్యత్తు అందిస్తానని మాటిచ్చానని చెబుతూ... 99 శాతం హామీలు అమలు చేసి చూపించానన్నారు. మన సంక్షేమ పథకాల్ని చూసి తట్టుకోలేక రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

నాపై అరడజను పార్టీలు బాణాలు ఎక్కుపెట్టాయని బాబుకు ఓటేయడమంటే చంద్రముఖిని ఇంటికి తెచ్చుకోవడమే అన్నారు. 175కు 175 అసెంబ్లీ సీట్లు, 25 లోక్‌సభ సీట్లకు 25 సీట్లు తెచ్చుకోవడమే మన లక్ష్యమని చెప్పారు. పేదవారి భవిష్యత్తు బాగుండాలంటే సీఎంగా జగన్‌నే రావాలని అప్పుడే పథకాలన్నీ అందుతాయని చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మేనిఫెస్టోకి శకుని చేతిలో పాచికలకు తేడా ఏముందని ప్రశ్నించారు.

మూడు పార్టీలు కలిసి 2014లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. 2014లో ఇచ్చిన ప్రత్యేక హోదా అమలు చేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటేయడమంటే పథకాల రద్దుకు ఓటేయడమే అన్నారు. చంద్రబాబు చెబుతున్న సూపర్ సిక్స్‌కు ఏటా రూ.73వేల కోట్లు కావాలని... చంద్రబాబు ఇస్తున్న హామీల విలువ ఇప్పటికే రూ.లక్షా యాభై వేల కోట్లు దాటుతున్నాయన్నారు. అబద్ధపు హామీలతో పొత్తుల డ్రామాతో మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు ప్రజల ముందుకు వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల యుద్ధంలో వంచకుల్ని వెన్నుపోటుదారుల్ని ఓడించేందుకు మీరంతా కూడా సిద్ధమా అని ప్రశ్నించారు. జరగబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఒక సైన్యంగా పని చేయాలని తెలిపారు. తొలుత వేదికపై వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేకంగా వై ఆకారంలో ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు.

తొక్కిసలాట

ఊపిరాడక పారిశుద్ధ్య కార్మికుడి మృతి

విశాలాంధ్రబ్యూరో-బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం జరిగిన సిద్ధం సభలో అపశృతి చోటుచేసుకుంది. సీఎం జగన్ వేదికపైకి వచ్చే సమయంలో తొక్కిసలాట జరిగింది. ఒంగోలుకు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఒనరగుడి మురళి(30) ఊపిరి ఆడక స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో అతడిని ఒంగోలు అసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బస్సు నుంచి జారిపడి వ్యక్తి మృతి

సిద్ధం సభకు హాజరై తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు ఓ యువకుడు బస్సు టైరు కింద పడి మృతి చెందాడు. అద్దంకి మండలం గోపాలపురం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా నరసరావుపేట చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గేదల బాలదుర్గ (27) సిద్ధం సభకు బయలుదేరి... ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో సభ వద్దకు వెళ్లలేక తిరుగూ ప్రయాణంలో బస్సులో నుంచి జారి పడటంతో అతనిపై అదే బస్సు టైరు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందారు.

ఆ నిమ్మకాయ ధర రూ.35వేలు!

ఈరోడ్: వేలంలో చిన్న నిమ్మకాయ రూ.35 వేలు పలికింది. ఈ ఘటన తమిళనాడులోని ఈరోడ్‌లో చోటుచేసుకుంది. గుడిలో శివరాత్రి పూజకు ఉపయోగించే నిమ్మకాయ రూ.35వేలకి అమ్ముడుపోయింది. ఈరోడ్‌కు 35 కిలోమీటర్ల దూరంలోని శివగిరి గ్రామంలోని పజపూసయన్ ఆలయంలో వేలం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక శివరాత్రి పూజలో శివుడికి సమర్పించిన నిమ్మకాయ ఇది. నిమ్మకాయలతో పాటు విగ్రహం ఆశీర్వదించిన ఇతర పండ్లను కూడా వేలం వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నిమ్మకాయ వేలంలో దాదాపు 15 మంది భక్తులు పాల్గొనగా ఈరోడ్‌కు చెందిన ఓ భక్తుడు ఆ నిమ్మకాయను రూ.35 వేలకు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆలయ పూజారి మేల్శాంతి అధ్వర్యంలో పూజలు నిర్వహించి నిమ్మకాయను వేలం వేశారు. వందలాది మంది భక్తుల సమక్షంలో వేలంపాట నిర్వహించారు. శివరాత్రి పూజకు ఉపయోగించే నిమ్మకాయను ఇంట్లో ఉంచుకున్న వ్యక్తికి రాబోయే సంవత్సరాల్లో సిరి సంపదలతో పాటు మంచి ఆరోగ్యం చేకూరుతుందని భక్తుల విశ్వాసం.

పేదలకు ఉచిత వైద్య సేవలందించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల
- మంగళగిరిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహణ

విశాలాంధ్ర-మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలందరికీ ఉచిత వైద్య సేవలు అందేలా చూడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. జిల్లా ప్రజాఆరోగ్య పరిరక్షణ సమితి, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి సంయుక్త అధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిడమర్రు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని విజయవాడ జనతా ఆస్పత్రి వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ రాంప్రసాద్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని 147 కోట్ల మంది ప్రజలలో కేవలం 10 కోట్ల మందికి మాత్రమే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి ఉందని, నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రస్తుతం ఖరీదైన వైద్యాన్ని చేయించుకునే స్థితిలో లేరని తెలిపారు. జిల్లా ప్రజారోగ్య సమితి 15 ఏళ్ల నుంచి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి సుమారు 3,500 మందికి కంటి ఆపరేషన్లు చేయించిందని ముప్పాళ్ల వివరించారు. శంకర కంటి ఆస్పత్రి వారు మానవతా విలువలతో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కంటిలో శుక్లాలతో బాధపడుతున్న వారందరికీ శుక్లాలు తీయించేందుకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యులు వందల మందికి వైద్య పరీక్షలు చేశారని అన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నట్టుగా ప్రభుత్వాలు కూడా తక్షణమే కంటి వైద్య సేవలను ఉచితంగా అందించడంపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ఉచిత కంటి వైద్య సేవలకు సంబంధించి ప్రకటించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ రాంప్రసాద్, గుంటూరు విసనం హాస్పటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కిలారి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం ప్రజలు ప్రాథమిక హక్కు అని అన్నారు. పేద ప్రజలకు అన్ని స్థాయిలో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని తెలిపారు. బిడ్డ పుట్టి దగ్గర నుంచి చనిపోయే వరకు వయోభేదం లేకుండా లింగ బేధం లేకుండా, మత ప్రమేయం లేకుండా అందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ సమితి తీర్మానించిందని వివరించారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలకు ఆ తీర్మానాన్ని పంపిందని, దానిని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. విజయవాడలో కూడా దీనికి సంబంధించిన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించిన అనంతరం 50 మందికి సోమవారం ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కార్నియా స్పెషలిస్ట్ డాక్టర్ చిన్మయి, డాక్టర్ మన్విత్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, క్యాంప్ నిర్వాహకులు, ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, కంచర్ల కాశయ్య, తుడిమెళ్ల వెంకటయ్య, బత్తూరి మోహనరావు, ఎస్.కె.కరీముల్లా, యార్లగడ్డ శివయ్య, కాకర్ల నరసింహారావు, బి.శ్రీనివాసరావు, గోహర జానీ, ఆళ్లమూడి హనోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ హాల్ టికెట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్1 ప్రిలిమ్స్ హాల్ టికెట్లను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) విడుదల చేసింది. అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఓటీపీఆర్ ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 1,48,881 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వివిధ విభాగాల్లో మొత్తం 81 గ్రూప్1 పోస్టులున్నాయి. వాటి భర్తీకి ఈ ఏడాది జనవరి 28వరకు దరఖాస్తులను ఏపీపీఎస్సీ స్వీకరించింది. ఈ నెల 17వ తేదీన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 18 కేంద్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరగనుంది. ఈ పరీక్షల నిర్వహణ కోసం ఏపీపీఎస్సీ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది.

ఒకటి రెండు రోజుల్లో సీట్లపై స్పష్టత: పురందేశ్వరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అరాచకాల పాలన అంతానికి అందరూ కలవాల్సిన అవసరముందని, టీడీపీ, జనసేనతో పొత్తులో భాగంగా తాము పోటీచేసే సీట్లపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం బీజేపీ ప్రచార రథాలను ఆమె ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసమే ఈ పొత్తులని చెప్పారు. 9 జిల్లాలకు బీజేపీ మేనిఫెస్టో రథాలను పంపనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రజలు ఏం ఆశిస్తున్నారన్న అంశంపై ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు.

సత్వరం అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం

సీపీఐ డిమాండ్

- పాలకుల నిర్లక్ష్యమే ప్రాజెక్టును కూల్చేసింది: ఈశ్వరయ్య
- సాగు, తాగునీటికి అల్లాడుతున్న జనం

విశాలాంధ్ర-రాజంపేట: అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండేళ్లు గడిచినా... ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోక పోవడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా నిరసించారు. గతంలో టీడీపీ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు నీటిపాలైందని విమర్శించారు. సీపీఐ అధ్వర్యంలో ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టు సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐతో పాటు పెద్ద ఎత్తున ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రాజెక్టును సందర్శన సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... రాజంపేట నుండి 24 కిలోమీటర్ల దూరంలో 1981లో రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలకు సాగునీరు తాగునీరందించేందుకు అన్నమయ్య ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా... 2001లో 2.2 టీఎంసీల సామర్థ్యంతో 5 గేట్లు పెట్టి ప్రాజెక్టు పూర్తి చేశారన్నారు. దీని ఆయకట్టు 22,500 ఎకరాలు కాగా రైట్ కెనాల్ ద్వారా కోడూరు నియోజకవర్గానికి, రాజంపేట నందలూరు పెనగలూరు పుల్లంపేట మండలాలకు తాగునీటి వసతి కల్పించే విధంగా ఈ ప్రాజెక్టు కట్టడం జరిగిందని తెలిపారు. కానీ అప్పటి టీడీపీ ప్రాజెక్టు స్థితిగతులను పట్టించుకోక పోవడంతో 2003లో అధిక వర్షాల ద్వారా 1 గేటు కొట్టుకో పోగా... అనంతరం మరమ్మతులు గేటు పునర్నిర్మించారని చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం... అన్నమయ్య ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించలేదని, ఆ తర్వాత 2019 లో వైసీపీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. గేట్ల మరమ్మతులకు రూ.4కోట్లు ఇవ్వాలని అధికారులు ప్రతిపాదన పంపించినా ఒక రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. 2021 నవంబర్ లో వరదలు ఎక్కువ వస్తున్నాయని తెలిసినా అధికార పార్టీకి చెందిన నాయకులు టంగుటూరు ప్రాంతంలో ఇసుకను తోడుకోవడానికి టిప్పర్లు, జేసీబీలు ఉంచడం ద్వారా గేట్లు ఎత్తనివ్వకుండా చేశారని... దీంతో నవంబర్ 19 వతేదీ తెల్లవారుజామున అన్నమయ్య ప్రాజెక్టు కట్ట తెగి కొట్టుకోపోయి సుమారు 12 గ్రామాల్లో వరద తాకిడికి ప్రజలు అల్లాడి పోయారని, 32 మంది మృతి చెందారన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పునరుద్ధరణకు 775.17 కోట్లు ఖర్చవుతుందని (గత అంచనాలు రూ.468 కోట్లు) అంచనా వేయగా... రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్ 2న ప్రాజెక్టుకు పాలనా అనుమతులు మంజూరు చేసింది. 24 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇంతవరకు రెండు ఇటుకలు కూడా పెట్టలేని పరిస్థితి దాపురించిందని ఈశ్వరయ్య విమర్శించారు. అన్నమయ్య ప్రాజెక్టు అతీగతి లేకుండా పోయిందని, సుమారు 100 గ్రామాలకు భూమిలో నీటి శాతం తగ్గిపోయి వ్యవసాయ బోరుబావులు ఎండిపోతున్నాయని చెప్పారు. మరోవైపు వేసవికాలం మొదలుకాక ముందే రాజంపేట ప్రాంతంలో తాగునీరు లేక అవస్థలు ప్రజలు పడుతున్నారన్నారు. అలాగే వరదల్లో సర్వం కోల్పోయిన గ్రామాల ప్రజలను పూర్తిస్థాయిలో ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. నేటికీ పేద ప్రజలు గుడారాల్లోనే ఉంటూ వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రాజెక్టు పనులు ప్రారంభించి పటిష్ఠంగా ప్రాజెక్టు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటాలకు సిద్ధమవుతుందని ఆయన హెచ్చరించారు. అభివృద్ధి అనే పదమే లేకుండా అన్నమయ్య జిల్లా ఉందని... ఈ పరిస్థితుల్లో వైసీపీకి ఎందుకు ఓటేయాలని ఆ పార్టీ నాయకులను ప్రశ్నించాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి పీ మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శివరామకృష్ణదేవరా, బీ విశ్వనాథ నాయక్, సాంబశివ, మండెం సుధీర్, బీ కృష్ణప్ప, మనోహర్ రెడ్డి, జ్యోతి చిన్నయ్య, రాజంపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల రంగారెడ్డి , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర , సీనియర్ నాయకులు కాటంశెట్టి వెంకటయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ చైతన్య, గంగాధర్, మురళి, కేశం ప్రసాద్, రాజశేఖర్, నాగమ్మ, ఆదినారాయణ, కృష్ణవేణి, నాగేశ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వలరాజు, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలు

కార్యకర్తలకు లోకేశ్ పిలుపు

విశాలాంధ్ర-ఉరవకొండ: టీడీపీ పాలనలోనే అనంతపురం జిల్లా అభివృద్ధి చెందిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఆదివారం ఉరవకొండలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉండగా... జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కియా ఫ్యాక్టరీని తీసుకొచ్చి 50 వేల మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. జగన్ అనంతపురం జిల్లాకి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. హంద్రీనీవా ఆధునీకరణ చేసి ప్రతి ఎకరాకి నీరు అందిస్తానని చెప్పి ఐదేళ్లలో గంప మట్టి కూడా తీయలేదన్నారు. హెచ్ఎల్‌సీ ఆధునీకరణ కూడా పూర్తి చేయలేదన్నారు. టీడీపీ పాలనలో రూ.840 కోట్లతో మెగా డ్రిప్ ఇరిగేషన్ పథకం చేపట్టగా... జగన్ సీఎం అయ్యాక మిగిలిన 10 శాతం పనులు చేయకుండా వదిలేశారని పేర్కొన్నారు. కాలువల ఆధునీకరణ, బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణాలు రైతులకు పంట నష్ట పరిహారం లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చంద్రబాబు ప్రభుత్వంలో చేశామని తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తున్నారన్న అక్కసుతో కేశవ్ కు అసెంబ్లీలో మైకు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కేశవ్‌ను చూసి జగన్‌మోహన్ రెడ్డికి భయం పట్టుకుందని తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, ఆయన కుమారుడు అవినీతి అక్రమాలకు అంతులేకుండా పోయిందని లోకేశ్ విమర్శించారు. ప్రజల ఆస్తులను, భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి వారికి ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు జనసేన, బీజేపీతో కలిసి సైనికుల్లా పని చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వైసీపీ హయాంలో 26వేల మంది బీసీలపై అక్రమ కేసులు పెట్టారని... 300 మందిని హత్య చేశారని పేర్కొంటూ... ఈ విషయాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లా లన్నారు. బీసీల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సిన రూ.25 వేల కోట్లను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిం దన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే... బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని... స్వయం ఉపాధి కోసం ఐదేళ్లలో పదివేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని... 50 ఏళ్ళ పైబడిన బీసీలకు ప్రతినెల రూ.4వేలు పింఛను అందించబోతున్నామని వివరించా లన్నారు. ఈ సభలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, జనసేన ఉరవకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గౌతం కుమార్ మాట్లాడారు. సభకు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు ఉరవకొండకు వచ్చిన నారా లోకేశ్‌కు పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

సికింద్రాబాద్-విశాఖ మధ్య మరో వందేభారత్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికులకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగానే విజయవాడ మీదుగా సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య మరో వందే భారత్ రైలును ఈనెల 12న ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ తెలిపారు. ఆదివారం డివిజనల్ కార్యాలయంలో ఉన్న డీఆర్‌ఎం సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వేలు మరింత అభివృద్ధి చెందాలనే లక్ష్యంగా ప్రధాన మంత్రి రూ.85 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను అంకితం చేయనున్నారని, ఈ నెల 12న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనేక రైళ్లను జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా 133 ఓఎస్ఓపీ స్టాల్స్, మూడు పీఎం గతి శక్తి టెర్మినల్స్, ఏడు గూడ్స్ షెడ్‌లు, ఒక పీఎం జన ఔషధి కేంద్రం, రెండు రైల్ కోచ్ రెస్టారెంట్‌లు, 12 విభాగాలు డబ్లింగ్/థర్డ్ లైన్, బైపాస్ ప్రాజెక్టులతో పాటు ప్రధానంగా విజయవాడ మీదుగా ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్‌కు అదనంగా సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండవ వందే భారత్‌ను రైలును ప్రారంభిస్తారని వివరించారు. విజయవాడ డివిజన్‌లో తణుకు, భిక్కవోలు, ఏలూరులో ఆధునీకరించిన మూడు గూడ్స్ షెడ్లు, గూడూరు-బిట్రగుంట మూడో లైన్‌తో పాటు 67 ఓఎస్ఓపీ స్టాల్స్, బిట్రగుంట-కరవాడి-చీరాల మూడో లైన్, విజయవాడ బైపాస్ లైన్లను జాతికి అంకితం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైల్ లైన్ ప్రాజెక్టు వ్యయం రూ.3,246 కోట్లు అని అన్నారు. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య రెండవ వందే భారత్‌ను ప్రవేశపెట్టడం అతిపెద్ద విషయమన్నారు. తగ్గిన ప్రయాణ సమయం, సమయపాలన, వాతావరణం కోసం యువత, టెక్కీలకు ఇది ప్రాధాన్యత ఉంటుంద న్నారు. విజయవాడ డివిజన్‌లో ఇది నాల్గవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అన్నారు. విశాఖపట్నం-విజయవాడ- సికింద్రాబాద్ సెక్షన్‌లోని అత్యంత రద్దీగా ఉండే మార్గంలో ప్రయాణికులకు ఇది ఉపయోగపడుతుం దన్నారు. దేశమంతటా సరుకు రవాణా కార్యకలాపాలను ప్రోత్సహించే లక్ష్యంతో భారతీయ రైల్వేలో గూడ్స్ షెడ్ల పెంపుదలకు సంబంధించి భారతీయ రైల్వేలు ముఖ్యమైన విషయాలను ప్రకటించడం సంతోషంగా ఉందని తెలిపారు. డివిజన్‌లో 15 గూడ్స్ షెడ్ల ఆధునీకరణ కోసం ఇటీవల రైల్వే మంత్రిత్వ శాఖ రూ.150 కోట్లకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ గూడ్స్ షెడ్లు తాడేపల్లిగూడెం, బయ్యారం, భిక్కవోలు, ద్వారపూడి, పడుగుపాడు, సామర్లకోట, కృష్ణా కెనాల్, ఏలూరు, గుడివాడ, తెనాలి, నిడదవోలు, పాలకొల్లు, ఆకివీడు, తణుకులో ఉన్నట్లు డీఆర్‌ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) ఎం.శ్రీకాంత్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు వావిలపల్లి, డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం మండ్రుప్‌కర్ పాల్గొన్నారు.

బీజేపీతో పొత్తులు అనైతికం

చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలి
సిద్ధం సభలకు రూ.కోట్ల ఖర్చు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీతో పొత్తులు అనైతిక మని, బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందని చంద్రబాబు పొత్తు పెట్టుకుంటున్నారు ? అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. చంద్రబాబు ఒక ఊసరవెల్లి అని, అవసరా నికి రంగులు మారుస్తున్నారని మండిపడ్డారు. విజయవాడ ఆంధ్ర రత్నభవన్‌లో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ మీద గౌరవం అంటున్నారనీ, ఏమిటీ గౌరవమని నిలదీశారు. రాష్టానికి హోదా, పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు, విభజన హామీలు నేరవెర్చనందుకు గౌరవమా ?అని ప్రశ్నించారు. దీనిపై చంద్రబాబు, పవన్ ఆలోచించాలన్నారు. మోసం చేసిన బీజేపీతో పొత్తులు ఎందుకో సమాధానమివ్వాలన్నారు. బాబు కనిపించే పొత్తు అని, జగన్ కనిపించని పొత్తు అని ఎద్దేవా చేశారు. ఏపీలో యువకులకు న్యాయం జరగడం లేదని, ఉద్యోగాలు లేక యువత చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో జగన్ మాట ఇచ్చి మరిచారని, 2.30లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఏపీపీఎస్సీ ద్వారా అన్ని ఉద్యోగుల భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని చెప్పారు. మెగా డీఎస్సీ అని చెప్పి, దగా డీఎస్సీ ఇచ్చారన్నారు. బీజేపీ ఈ దేశంలో 10 ఏళ్ల అధికారంలో ఉందని, బీజేపీ వచ్చాక దేశంలో నిరుద్యోగం పెరిగిందని షర్మిల విమర్శించారు. హామీ ప్రకారం 20 కోట్ల ఉద్యోగాలు రావాలని, దేశంలో ప్రతి రాష్ట్రాన్ని బీజేపీ మోసగించిందన్నారు. యువతకు న్యాయం కోసం కాంగ్రెస్ ఒక మ్యానిఫెస్టో ఇచ్చిందని, భర్తీ బరోసా స్కీమ్ ద్వారా దేశంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ అవుతాయని చెప్పారు. సీఎం జగన్ సిద్ధం సభలు పెట్టి రాష్ట్ర ఆదాయాన్ని దోచుకుంటున్నారని, ఒక్కో సభకు రూ.90 కోట్లు ఖర్చు పెడుతున్నారని, ఇప్పటి వరకు రూ.600 కోట్లు ఖర్చు చేశారట అని, ఇదంతా ఎవరి డబ్బు అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల్లో నేను ఎక్కడ పోటీ చేయాలనే దానిపై చర్చించామని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామన్నారు.

ఈఎస్ఐ ఫార్మాసిస్టు రవికుమార్ బదిలీ

విశాలాంధ్ర-విజయవాడ: కార్మికరాజ్య బీమా వైద్య సేవలలో ఫార్మాసిస్టుగా పనిచేసే బులుసు రవికుమార్ విశాఖలోని ఈఎస్ఐ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. విశాఖ ఈఎస్ఐ ప్రధాన ఆసుపత్రిలో ఫార్మాసిస్టుగా ఆయన ఇటీవల బాధ్యతలు స్వీకరిం చారు. విజయనగరం, గరివిడి, చిట్టివలసల్లోని ఈఎస్ఐ డిస్పెన్సరీలలో ఫార్మాసిస్టుగా ఆయన సమర్థవంతంగా సేవలు అందించారు. ఆ తరువాత విజయవాడలోని జేడీఎంఎస్ కార్యాలయంలోని మెయిన్ స్టోర్‌కు బదిలీపై వచ్చారు. ఈఎస్ఐలో మందుల కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగి మందుల కొనుగోలు బాధ్యతను జేడీఎంఎస్‌ల నుంచి తప్పించడంతో విజయవాడ గుణదల డిస్పెన్సరీ, జగ్గయ్యపేట డిస్పెన్సరీలో ఫార్మాసిస్టుగా పనిచేశారు. జగ్గయ్య పేట డిస్పెన్సరీలో ఫార్మాసిస్టుగా పనిచేస్తూనే జేడీఎంఎస్ కార్యాలయంలో కూడా సేవలు అందించారు. ఫార్మాసిస్టుగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన మందులు సకాలంలో అందించడంలో ఆయన కృషి ఎనలేనిది. కార్మికులకు కావాల్సిన మందులు తను పనిచేసే డిస్పెన్సరీలో అందుబాటులో లేకపోతే ఏ డిస్పెన్సరీలో అధనంగా ఉన్నాయో తెలుసుకుని అక్కడికి వెళ్లి అవి తీసుకుని తను పనిచేసే డిస్పెన్సరీలో అవసరమైన వారికి అందజేసి అందరి మన్ననలు పొందారు. అలాగే తమ డిస్పెన్సరీలో అదనంగా ఉన్న మందులను ఏ డిస్పెన్సరీకి అవసరమో తెలుసుకుని అక్కడికి పంపించి ఆ డిస్పెన్సరీ పరిధిలోని బీమాదారులకు కూడా మందులు సకాలంలో అందేవిధంగా చూసేవారు. అలాగే ఈఎస్ఐలో మందుల కొనుగోలు కుంభకోణానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తులో డిపార్టుమెంట్ తరుపున అవసరమై సహాయాన్ని అందజేశారు. ఫార్మాసిస్టుల అసోసియేషన్ నాయకునిగా ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు.

కేంద్ర మంత్రి గజేంద్రసింగ్‌తో పవన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అనంతరం పార్టీ అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు షెకావత్ ఆదివారం విజయవాడకు వచ్చారు. బీజేపీ నేతలతో కేంద్ర మంత్రి సమావేశం అనంతరం పొత్తులో ఉన్న పవన్‌ను కలిశారు. సీట్ల ఎంపికపై చర్చించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా బీజేపీ, జనసేన కూటమికి 30 అసెంబ్లీ సీట్లు ప్రకటించారు. ఇందులో బీజేపీకి, జనసేనకు ఎన్ననేదీ లెక్క తేలాల్సి ఉంది. ఇప్పటికే టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా జనసేనకు 24 అసెంబ్లీ సీట్లు, మూడు ఎంపీ సీట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు కుదిరాక జనసేనకు ఇచ్చిన సీట్లలో కోత పడుతుందా? యథాతథంగా ఉంటాయా? అనేదీ ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఒకటి రెండు రోజుల్లో సీట్ల కేటాయింపుపై స్పష్టత రానుంది.

నేటితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు

విశాలాంధ్ర-శ్రీశైలం: శ్రీశైలంలో సోమవారంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకుని ఆలయంలో 11 రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ రోజు ఆదివారం ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా బ్రహ్మోత్సవాల మొదటి రోజు ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజ పటం అవరోహణ చేశారు. అనంతరం సదస్సు నాగవల్లి కార్యక్రమాలను అర్చక స్వాములు పూర్తిగావించారు. ఈ విశేష కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు చక్రపాణి రెడ్డి, ఆలయ అర్చక వేద పండితులు పాల్గొన్నారు.

అభ్యుదయ సాహిత్య విజ్ఞాన సర్వస్వం పెనుగొండ

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
సెల్: 9440222117

"యేపట్నం యెక్కడుందో, యే కొండలెక్కడున్నాయో
అడగవయ్యా గిరీశంగార్ని నిలుచున్నపాట్న చెబుతాడు"

కన్యాశుల్కం నాటకంలో మహేశం అన్నమాట ఇది. అది తన గురువు కరటకశాస్త్రి పట్ల అసంతృప్తితో అన్నమాట. ఆమాటను అనుకూలదృష్టితో పెనుగొండ లక్ష్మీనారాయణకు అన్వయిస్తే చక్కగా సరిపోతుంది. అర్ధరాత్రిలో నిద్రలేపి అరసంకు సంబంధించిన ఏ విషయాన్నడిగినా అర్ధనిముషం కూడ తడుముకోకుండా టక్కున సమాధానం చెబుతారు. ఆయన నడిచే అరసం విజ్ఞానసర్వస్వం. ఆయన శరీరావయవాల్లో, ఆయనదుస్తుల్లో అరసం వివరాలే ఉంటాయి.

పెనుగొండ లక్ష్మీనారాయణ అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడయ్యారంటే, ఆ పదవి ఆయనకు శూన్యంలోంచి, ఆకాశంలోంచి ఊడిపడలేదు. ఆయనే అరసంగా,అరసమే ఆయనగా క్రియాశీలంగా జీవించడం వల్లనే సాధ్యమైంది. మూడవ తరం ప్రతినిధిగా అరసం నిర్మాణంలో పెనుగొండ చేసిన కృషి అరసంను ఉన్నత శిఖరాలకు చేర్చింది. 1973లో గుంటూరులో జరిగిన అరసం రాష్ట్ర మహాసభలలో ఒక ప్రతినిధిగా హాజరై అంచె లంచెలుగా ఎదిగి, అరసంలో విభిన్న హోదాలలో పనిచేసి, రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. 50 ఏళ్లు అరసం నిర్మాణంలో తలమునకలై ఇవాళ భారతీయ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులయ్యారు. అఖిలభారత అరసం అధ్యక్షులైన తొలి తెలుగురచయిత పెనుగొండ.

పెనుగొండ కవి, విమర్శకుడు, పరిశోధకుడు, సంపాదకుడు, విప్లవ సాహిత్యంలో తెలుగులో ప్రాణం పోసుకుంటున్న సమయంలో అరసంలో అడుగుపెట్టిన పెనుగొండ, తర్వాత అస్తిత్వ ఉద్యమాలు ప్రవేశించి, మార్క్సిజం వ్యతిరేకగాలులు వీస్తున్నా మొక్కవోని నిబద్ధతతో అరసంకు కట్టుబడి ఉన్నారు. పెనుగొండ అరసం చెక్కిన శిల్పి. నిత్య చైతన్యశీలి. 1918లో సౌందర్యవల్లి అనే పత్రికలో "కడపటి పైసా" అనే కథ వచ్చింది. అందులో జీవితం మీద విరక్తి వచ్చి చనిపోవాలని కృష్ణానది వైపు పోతూ, ఒకచోట ఒక మనిషి హాయిగా ఉండడం చూసి, అతను మరణించాల్సిన అవసరం లేదని వెనక్కి వచ్చేస్తాడు. పెనుగొండను చూసినాక, నిరాశాజీవులు కూడా ఆశాజీవులుగా మారతారు. ఆయనకు సమాజంపట్ల గల గౌరవం, జీవితంపట్ల గల నమ్మకం నిత్య క్రియాశీలిగా తీర్చిదిద్దాయి. ఆయన మనుషుల్ని ప్రేమిస్తారు. ఇతరులలోని విశిష్టతలను నిర్మొహమాటంగా చెబుతారు. ఆయనకు బలమైన ఇష్టాయిష్టాలున్నాయి. వాటిని దాచుకోకుండా వ్యక్తం చేస్తారు.

అరసం బాధ్యుడుగా పెనుగొండ మార్క్సిజం పట్ల అచంచలమైన విశ్వాసం పెంపొందించుకున్నారు. ఇతర ప్రగతిశీల భావజాలాలను గౌరవిస్తూనే మార్క్సిజం నిబద్ధతకు కట్టుబడ్డారు. దళిత స్త్రీ వాదాలను ఆహ్వానిస్తూనే "దళిత ఉద్యమానికి వర్ణ దృష్టితో పాటు వర్గ దృష్టి కూడ అవసరం. నిర్దిష్టమైన వర్గ దృక్పథం లేనట్లయితే, ధనిక దళిత వర్గం ప్రయోజనాలను పొందే ప్రమాదాన్ని మనం గుర్తించవలసి ఉంది. మొత్తం సామాజిక విముక్తి జరగకుండా స్త్రీ విముక్తి ఒక్కటే ఎన్నటికీ సాధ్యం కాదు. సామాజిక విముక్తిలో స్త్రీ విముక్తి ఒక భాగం (అనేక: 71, 74) అన్నారు.

పెనుగొండ మొదట "రేపటిలోకి" అనే కావ్యం ప్రచురించి తర్వాత విమర్శకు పరిమితమయ్యారు. అనేక (2004) విదిత (2014) దీపిక (2021) గుంటూరు సీమ సాహిత్య చరిత్ర (2020) నూరేళ్ల పులుపుల-అయిదు విమర్శ గ్రంథాలు ప్రచురించారు. ఇవన్నీ ప్రపంచీకరణ యుగంలో మార్క్సిజం వ్యతిరేక ప్రచారం జరుగుతున్న సమయంలో ప్రచురించటం గుర్తొస్తే పెనుగొండ మార్క్సిస్టు నిబద్ధత అర్ధమవుతుంది. ఇవికాక పెనుగొండ అసంఖ్యాక గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. గౌరవ సంపాదకులుగా ఉన్నారు. సహ సంపాదకులుగా ఉన్నారు. ఎస్వీ సత్యనారాయణ, పాపినేని శివశంకర్, వల్లూరు శివప్రసాద్‌లతో కలిసి పెనుగొండ అభ్యుదయ సాహిత్య రచనల ప్రచురణలో భాగస్వామి అయ్యారు. అభ్యుదయ సాహిత్య రచన, సాహిత్య అధ్యయనం, సాహిత్య ప్రచారం, సాహిత్య ప్రచురణ, అరసం నిర్మాణం- అయిదు పార్శ్వాలలో పెనుగొండ తన కర్తవ్యాలను నిర్వహిస్తూ ఉన్నారు.

పులుపుల వెంకటశివయ్య, పరుచూరి రాజారాం, కొండేపూడి శ్రీనివాసరావు తనకు ప్రోత్సాహకులని ఆయన పేర్కొన్నారు. అభ్యుదయవాదిగా సహజంగానే పెనుగొండకు ఆధునిక తెలుగు సాహిత్యానికి పునాదులు వేసిన కందుకూరి, గురజాడ, గిడుగుల మీద గొప్ప గౌరవం ఉంది. ఆ తర్వాత తెలుగు అభ్యుదయ సాహిత్యం పుట్టుక, వికాసం మీద పెనుగొండకు సుస్పష్టమైన అవగాహన ఉంది. తెలుగులో శ్రామిక వర్గ సాహిత్యం, తెలుగు సాహిత్యంలో ప్రజా ఉద్యమాల చిత్రణ, సజీవ స్రవంతి అభ్యుదయ కవిత్వం, అభ్యుదయ సాహిత్యం- దళిత జీవన చిత్రణ, తెలంగాణ విమోచన పోరాట సాహిత్యం- ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘీభావం, ప్రపంచీకరణ- తెలుగు కవిత్వం వంటి విలువైన వ్యాసాలు పెనుగొండ అభ్యుదయ సాహిత్యావగాహనకు నిదర్శనాలు. ఇవిగాక ఆయన గురజాడ, మాగోఖలే, చాసో, అందె నారాయణ స్వామి, రెంటాల గోపాలకృష్ణ, సెట్టి ఈశ్వరరావు, సోమసుందర్, బొల్లిముంత శివరామకృష్ణ, వాసిరెడ్డి సీతాదేవి, ఉన్నవ లక్ష్మీ నారాయణ, గుర్రంజాషువ వంటి వారి నుండి పాపినేని శివశంకర్, వల్లూరు శివప్రసాద్, ఎస్వీ సత్యనారాయణ, రాచపాళెం వంటి వారి దాకా కొన్ని పదుల మంది అభ్యుదయ రచయితల మీద విలువైన వ్యాసాలు ప్రచురించి, అభ్యుదయ సాహిత్య విమర్శ వికాసానికి దోహదం చేస్తున్నారు. తెలుగులో సాహిత్య సంకలనాల మీద పెనుగొండ చేసినంత అధ్యయనం మరొకరు చేయలేదనిస్తుంది.

పెనుగొండకు ఆధునిక ప్రజాసాహిత్య విజ్ఞానం పుక్కిటి బంటిగా ఉంది. ఆయన విమర్శలో ఒక ప్రధాన అంశం తొలి రచనలను గుర్తించడం. తెలుగులో తొలి కథా సంకలనం కథావళి 1932, కులవృత్తి వస్తువుగా కథా రచన చేసిన తొలి రచయిత అందె నారాయణస్వామి, ఆంగ్లం నుండి తెలుగులోకి కథలను అనువాదం చేసిన తొలిరచయిత అక్కిరాజు ఉమాకాంతం, తెలుగులో రాజకీయ గేయానికి శ్రీకారం చుట్టిన వారు గరిమెళ్ల సత్యనారాయణ - ఇలా పెనుగొండ కనీసం వంద విషయాలలో ఆద్యులను గుర్తించారు. ఆయనకు చరిత్ర పట్ల గల శ్రద్ధకు నిదర్శనం ఇదే. ప్రజా సాహిత్య చరిత్రలో అనేకులు చేసిన తప్పులను ఎత్తిచూపడానికి పెనుగొండ ఎప్పుడూ సంకోచించలేదు. 'అమ్మవారి నవ్వు' అని హిందూ ముస్లిం సామరస్య దృష్టితో కేతు విశ్వనాథరెడ్డి రాసిన కథ మీద నిరసనతో మహమ్మద్ ఖదీర్‌బాబు 'మక్కా చంద్రుడు' పేరుతో ప్రతి కథ రాశారు. దానిమీద పెనుగొండ "విధ్వంససాహిత్యాన్ని తిరస్కరిద్దాం" అనే వ్యాసంరాశారు. ఖదీర్ చేసినపని రచయిత స్వేచ్ఛను హరించడంగా ప్రజాస్వామిక భావాల మీద దాడిగా ఆయన పేర్కొన్నారు. "సాహిత్యంశ్రీశీష సంగతులు" అనే వ్యాసంలో వర్తమాన తెలుగు సాహితీరంగంలోని అనేక లోపాలను, రుగ్మతలను ఎత్తిచూపారు. మనం విమర్శకులని భావిస్తున్న చాలామందికి పరిచయం, సమీక్ష, విమర్శ అనే వాటి మధ్య తేడాలే తెలియవు అన్నది ఒక ఫిర్యాదు. సాహిత్య సభలకు తెలుగు అధ్యాపకులు హాజరుకాకపోవడాన్ని ఎత్తి చూపారు. లౌకికవాదులుగా చలామణి అవుతున్న వాళ్లు నిజ జీవితంలో అందుకు విరుద్ధంగా ప్రవర్తించే వాళ్లను పెనుగొండ ఉపేక్షించలేదు. వెల్చేరు నారాయణరావు, చాసో పొరపాటున తాను మార్క్సిస్టునని నమ్మాడని రాసిన వ్యాసాన్ని , పెనుగొండ చాసో ముమ్మాటికీ మార్క్సిస్టురచయిత అని బదులిచ్చారు. 2012 లో తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు తెలుగుభాష దుస్థితిని నివారించకుండా సభలు జరపడం వలన ప్రయోజనం లేదని రెండు వ్యాసాలు రాశారు. తిరుపతిలో నిరసన కూడ తెలిపారు. "తెలుగు సాహిత్యంపై శ్రీశ్రీ ప్రభావం" అనే కడియాల రామమోహన్ పుస్తకంలోని లోపాలను ఎత్తిచూపుతూ "రాయ్‌గారూ! ఇదేమి పరిశోధనని" నిలదీశారు. అలాగే రామమోహన్‌రాయ్ రచించిన "మన తెలుగు నవలలు" గ్రంథంలోని లోపాలను కూడ ఎత్తిచూపారు. "గురజాడ సాహిత్యం- వక్రీకరణలు" అనే వ్యాసం చాలా విలువైనది. గురజాడ సాహిత్యం మొత్తాన్ని పరిచయంచేసి, డా.సి.నారాయణరెడ్డి "ఇద్దరు యుగ కర్తలు" అని చేసిన సూత్రీకరణను తిరస్కరించారు. అలాగే కృపాకర్ మాదిగ వ్యాసాన్ని కూడ పెనుగొండ సుదీర్ఘమైన వివరణతో పూర్వపక్షం చేశారు. అక్కిరాజు రమాపతిరావు సంపాదకుడుగా వచ్చిన "తొలి మలితరం తెలుగుకథలు" లో లోపించిన శాస్త్రీయతను, ప్రామాణికతను పెనుగొండ ఎత్తిచూపారు. సాహిత్య అధ్యయనంలో దొరిలే తప్పులను నిస్సంకోచంగా ఎత్తిచూపి, సాహిత్యచరిత్రను ప్రక్షాళన చేయడం, శత్రువులను సంపాదించి పెట్టే కార్యక్రమాల్ని అయినా పెనుగొండ ఆ పని చిత్తశుద్ధితో చేశారు.

అభ్యుదయ రచయితలను పరిచయం చేస్తూ, పెనుగొండ,



పాఠకులకు వాళ్లనాడిని పట్టి చూపుతారు. ఆధునిక మహిళ చరిత్రను తిరిగి రచిస్తుంది అన్న గురజాడ మాటకు 1994 నాటి సారా వ్యతిరేక ఉద్యమం నిలువెత్తు సాక్ష్యం అని అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు వీరేశలింగం అని, తిరునగరి రామాంజ నేయులు తెలంగాణ గోర్కీ అని కీర్తించిన విషయం ఆసక్తిగా తెలిపారు పెనుగొండ. మధ్యయుగంలో వేమన ప్రజా కవిత్వానికి శ్రీకారం చుట్టారని గుర్తించారు.

పెనుగొండ పిడివాదికాదు. ప్రజాస్వామ్యవాది ఎక్కడి నుంచైనా జ్ఞానాన్ని స్వీకరించే వినయశీలి. అందుకే "ఏ సాహిత్యానికైనా ఆదాన ప్రదానాలుంటేనే సుసంపన్నమౌతుంది" అన్నారు. శ్రమలో సౌందర్యాన్ని చూసే అభ్యుదయ వాది. అనేకమంది రచనలను సంకలనంగా తయారుచేయడంలోని అందాన్ని ఆయన ఎంతో అందంగా చెప్పారు. "పూల నుంచి తేనె బిందువులను సేకరించి ఒక తేనెటీగ తేనెపట్టును నిర్మించే కృషితో పోల్చదగింది కథా సంకలనాల నిర్మాణం. రెండింటిలోనూ నిర్విరామ కృషి, నిశిత దృష్టి ఎంతో అవసరం."

అభ్యుదయ సాహిత్య విమర్శ లేదా మార్క్సిస్టు విమర్శ అంటే సామాజిక పరిణామాల నేపథ్యంలో విశ్లేషించేదని అర్థం. ఇందుకు విమర్శకులకు చారిత్రక దృష్టి ఉండాలి. చరిత్ర జ్ఞానం ఉండాలి. పెనుగొండకు అభ్యుదయ సాహిత్య నేపథ్యానికి సంబంధించి చాలా సమాచారం తెలుసు. ఆయన రాసిన ఆరేడు వ్యాసాలలో ఈ విషయం తెలుస్తుంది.

అభ్యుదయ రచయితలను పరామర్శిస్తూ, పెనుగొండ గొప్ప సూత్రీకరణలు చేశారు. అలాగే అభ్యుదయ రచనల గురించి కూడా. "అందే నారాయణస్వామి తన వైయక్తిక దుఃఖాలకు ఎక్కడా ఏమాత్రం తావివ్వకుండా సామాజికాంశాల నేపథ్యంలోనే రచనలు చేశారు." "సమకాలీనతనధిగమించి భవిష్యత్తులోకి దృష్టి సారించిన ఉత్తమ కథా రచయిత అక్కిరాజు ఉమాకాన్తమ్." తెలుగులో వెలువడిన అసమగ్రత కలిగిన తొలి దేశభక్తి గీతం గురజాడ దేశభక్తి కవిత." "జీవితాన్ని ఉన్నతీకరించడంలో, జీవిత సారాన్ని సూత్రీకరించే క్రమంలో శివశంకర్ కవిత్వం తాత్వికస్థాయిని చేరుకుంది." "ఎస్వీది తిరుగులేని అభ్యుదయవాణి."

"విమర్శ- ఆత్మ విమర్శ" అన్నది మార్క్సిస్టు విమర్శకుల లక్షణం.

పెనుగొండలో ఈ లక్షణముంది. "సంఘ సంస్కరణోద్యమాలను భాగం చేసుకొని, ఆర్థికపరమైన ఉద్యమాలను నిర్మించి ఉంటే, రెండూ సమాంతరంగా అభివృద్ధి చెంది ఉండేవి. అయితే సంస్కరణోద్యమాలను నిర్లక్ష్యం చేయడం ద్వారా అనేక సామాజిక రుగ్మతలు అలాగే మిగిలిపోయాయి" అని పెనుగొండ అభిప్రాయపడ్డారు. భారతదేశం వంటి దేశంలోని సామాజిక నిర్మాణంలోని సంక్లిష్టతను దృష్టిలో పెట్టుకొని పెనుగొండ చెప్పిన మాటను అందరూ ఆలోచించవలసిన అవసరం ఉంది.

చాలామంది అభ్యుదయవాదులకు స్వాతంత్ర్యోద్యమమంటే గౌరవం ఉంది. అయితే స్వాతంత్ర్యానంతర భారతదేశ స్థితిగతుల పట్ల మాత్రం అసంతృప్తి ఉంది. పెనుగొండకూ ఆ అసంతృప్తి ఉంది. స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజలను చీకట్లో ఉంచడానికి ప్రణాళికాబద్ధంగా ప్రయత్నించాయి మన ప్రభుత్వాలు అన్నారాయన. ఇప్పటికీ ఇదే జరుగుతున్నది.

పెనుగొండ విమర్శ గ్రంథాలన్నీ ఒక ఎత్తు. గుంటూరు సీమ సాహిత్య చరిత్ర ఒక్కటే ఒక ఎత్తు. ఈ గ్రంథాన్ని ఆయన చాలా ఇష్టంగా, మక్కువతో, ప్రేమతో రాశారు. ఈ పుస్తకాన్ని రాయడానికి పెనుగొండ స్వస్థానాభిమానమే గాదు, తెలుగువారి ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలలో గుంటూరుజిల్లా నిర్వహించిన పాత్ర కూడ కారణం. అరసం రాష్ట్ర మహాసభలకు గుంటూరుజిల్లా అనేక పర్యాయాలు ఆతిథ్యమిచ్చింది. తొలి అరసం తరగతులు జరిగింది అక్కడే. గొప్పగొప్ప అభ్యుదయ రచయితలందరూ ఆ జిల్లాలో పుట్టారు. బౌద్ధం విలసిల్లిన సీమ అది. ఇంకా అనేక కారణాల చేత పెనుగొండ అభినివేశంతో ఈ గ్రంథం రాశారు. ఇది ఆయన మాగ్నంఒపస్ అనవచ్చు.

పెనుగొండ అభ్యుదయ సాహిత్య విజ్ఞాన సర్వస్వమే కాదు గుంటూరు సీమ సాహితీ సాంస్కృతిక విజ్ఞాన సర్వస్వం కూడ. ఈ గ్రంథం రాయాలనుకుని, ఇప్పటికిప్పుడు విషయ సేకరణ చేసి రాసిన గ్రంథం కాదిది. పెనుగొండ బాల్యం నుంచి గుంటూరుజిల్లా సాహిత్యం మీద అసంఖ్యాక వ్యాసాలు రాసిన అనుభవం ఈ పుస్తక రచనకు దారితీసింది. ఒక జిల్లా కొలమానంగా సాహిత్య చరిత్ర ఎలా రాయవచ్చునో ఈ గ్రంథం నమూనాగా నేర్పుతుంది. శాసనాలు, కైఫియత్తుల నుండి గుంటూరుజిల్లా పురస్కార ప్రదాన సంస్థల దాకా సమగ్రంగా రచించారు పెనుగొండ. దీని కోసం పెనుగొండ చాలా పూర్వ గ్రంథాలు అధ్యయనం చేశారు. ఈ గ్రంథం కేవలం విమర్శ గ్రంథం కాదు, ఇదొక పరిశోధన గ్రంథం. విశ్వవిద్యాలయాల పరిభాషలో ఒక పిహెచ్‌డి ఇవ్వదగిన గ్రంథం. గుంటూరు జిల్లాలో రెండువేల మంది రచయితలున్నారని, దాదాపు వెయ్యి మంది పద్యకవులేనని అంచనా కట్టారు పెనుగొండ. "సాహిత్యానికి ఎల్లలు లేవు" అనే విశాల దృక్పథంతో ఈ గ్రంథం రాశారు పెనుగొండ. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలకూ గుంటూరుజిల్లా వేదికగా నిలిచింది. అలాగే అన్ని వాదాల సాహిత్యానికి కూడ గుంటూరుజిల్లా జానపద, ప్రాచీన సాహిత్యాల పరిశోధన పరిమితంగా ఉన్నా ఆధునిక సాహిత్య పరిశోధన మాత్రం సమగ్రంగా చేశారు పెనుగొండ. తెలుగు అభ్యుదయ సాహిత్యానికి సాహిత్య సృష్టిపరంగానూ, అరసం నిర్మాణపరంగానూ గుంటూరుజిల్లా చేసిన దోహదాన్ని పెనుగొండ అక్షరం పొల్లుబోకుండా రికార్డు చేశారు. ఈ గ్రంథంలో అనేక మంది పూర్వ రచయితల, విమర్శకుల అభిప్రాయాలను గౌరవంగా ఉదహరించి, పెనుగొండ సాధికారతను సాధించారు.

నాటక సాహిత్యం మీద పెనుగొండకు ప్రత్యేక ఆసక్తి ఉంది. సురభి నాటక సమాజం గురించి రాసిన వ్యాసమే ఇందుకు నిదర్శనం. ప్రపంచ చరిత్రలోనే సురభి వంటి సంస్థ మరొకటి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. "సురభి నాటక కళాకారులకు పుట్టుకైనా, చావైనా ఆ కళామతల్లి ఒడిలోనే" అనేక ఉదాహరణలతో స్పష్టం చేశారు. ఆ కళాకారుల మధ్య కులమతాల భేదాలుగానీ, స్థాయీ భేదాలుగానీ లేవని పేర్కొన్నారు. వల్లూరు శివప్రసాద్ నాటకాల మీద సమగ్రంగా పరిచయ వ్యాసం రాశారు. ఆయన నాటకాల మీద విడివిడి వ్యాసాలు కూడ రాశారు.

ఎల్లలు కాని విశాల దృక్పథం గల విమర్శకుడుగా పెనుగొండ తెలుగు నేల మీదున్న అన్ని ప్రాంతాల సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. అన్ని ప్రాంతాల రచయితలతో ఆయన స్నేహం కలిగి ఉంటారు. ఆయన విమర్శలో రచయితల వాచకాలేకాక, రచయితల వ్యక్తిగత జీవితాలు కూడ మనకు తెలుస్తాయి.

"మానవతాపతాకం మీద శ్రామిక జన శ్రేయోరాజ్య
స్థాపన కోసం ఉద్యమిస్తు ఎర్రజెండా శ్రేణుల్లో
పెనుగొండ మమేకమయ్యాడు" (ఏటుకూరి ప్రసాద్)
ప్రగతిశీల సాంస్కృతికోద్యమ చరిత్రలో
పెనుగొండది చిరస్మరణీయమైన స్థానం (వల్లూరు శివప్రసాద్)
అభ్యుదయం అనేది కణకణాన జీర్ణించుకొన్న
కరడుగట్టిన అభ్యుదయవాది పెనుగొండ (మోదుగుల)
పెనుగొండ పొగడ్తల అగడ్త కాదు. (చందు సుబ్బారావు)

సాహితి

అతను బయటకొచ్చాడు

-శ్రీరామ్ పుప్పాల
సెల్: 9963482597

అతను బయటకొచ్చాడు
ఎడం కాలిమీద కుడి కాలు వేసుకుని
చదును చేసిన చేను వంటి ముఖంతో
అందంగా
దెబ్బలు తిన్న దేహంపై
చీలిన గుండెలపై
బొత్తాలు పెట్టుకుని
హుందాగా ఫుల్ హేండ్స్
ఆశల చొక్కా వేసుకుని

అతను బయటకొచ్చాడు

ఎన్నిసార్లతని కలల్ని
పొరలు పొరలుగా కప్పెట్టినా
ఎన్ని పేజీల కవిత్వాన్ని
నిర్దాక్షిణ్యంగా నిప్పు పెట్టినా

ఆ చీకటి గదుల్లోంచి
గడ్డకట్టే మంచు సరస్సులోంచి
దహించే నిరీక్షణలోంచి
నెమ్మదిగా
సుకుమారంగా
బయటి ప్రపంచపు గోడల మధ్య
జ్ఞాపకాలు ప్రతిధ్వనిస్తున్నప్పుడు

అతను బయటకొచ్చాడు

ఒంటరితనంలోంచి
ఇనుప పంజరంలోంచి
ఒకసారి విడుదలయ్యి-
బంధింపబడి-
మళ్లీ విడుదలయ్యి-

ఓపిగ్గా సాలెపురుగు గూడునల్లినట్టు
చీమలు పుట్టలు బెట్టినట్టు
నత్తవలె కదుల్తూ
నెమ్మదిగా

అతను బయటకొచ్చాడు

అతని హృదయంలో కాంక్ష గొప్పది
ఆ చేతి వేళ్ళ లోంచి నిలబడిన
అక్షర పాదాలకి ఓపిక ఎక్కువ

పోరాటమ్మీద ఎనలేని ప్రేమ

మేల్కొన్న నిద్రల్లోంచి
మూసిన రాత్రి కనురెప్పల్లోంచి
జైల్లో కొత్త స్నేహితుల చిరుముద్దులు
తీసుకుని
రాసి పోస్టు చేయలేకపోయిన ఉత్తరాలతో
సెంట్రీ గార్డుకు సలాము పెట్టి
తాళంగుత్తుల సవ్వడిలో
ఓ దిగులు ఉదయాన

అతను బయటకొచ్చాడు

నిప్పుల నదిలా
కథలా
కవితలా
రోడ్లమీద బిగ్గరగా పాడుతున్న
పాటల మధ్యకి
కబీరులా
చావును నిరాకరించిన
అదే మెదడుతో
కోరెగావ్ దళిత హృదయంతో
చక్రాల కుర్చీలోంచి
నిర్భయంగా

దిగులుపడ్డ వాళ్ళమ్మ వంటి
అనేక తల్లుల తండ్లాటల మధ్య
అమరుడైన సహచరుణ్ణి తలుచుకుంటూ

అతను బయటకొచ్చాడు



తెల్లవారుజామున...

కాళ్లను కట్టిపడేస్తున్న
అనేక ప్రతిబంధకాలు
అయినా ఈ క్షణాన్ని దాటాలి

ఎన్నెన్నో ఆటంకాల హద్దుల
కాల ప్రవాహాన్ని ఎదురీది
అయినా ఈ గంట ఒడ్డుకు చేరాలి

నిరంతర దర్శన ఘర్షణలు
అననుకూల స్థితులను రమించి
అయినా ఈ రోజుకు భరతవాక్యం పలకాలి

సూర్యుడు కన్ను తెరిస్తే వేకువ కర్మ
కాంతి రెప్పలు మూస్తే రాత్రి కర్త

వెలుతురు మొగ్గ వికసిస్తే ఉదయ క్రియ
ఇటీవల కవి పంటికిందిరాయిలా
అతి మర్యాదస్తుడై భద్రలోక
శోక సంచారి అయ్యాడు

అలౌకికం నుంచి లౌక్యంలో
పీకల్లోతు మునిగి కుళ్ళిపోయాడు

పులి కళ్ళ రౌద్రం క్రౌర్యం కోల్పోయి
పిల్లిలా పాలు కాజేస్తూ కళ్ళు మూసుకున్నాడు

మచ్చుకైనా కానరాక
చిన్న సెగకే పాలలా విరిగి
తెల్లవారుజాము ఇగిరిపోయింది
దారం తెగని పతంగిలా
కవిత్వ సూత్రం మిగిలిపోయింది

జూకంటి జగన్నాథం



ప్రసన్న భారతి కథా మంజరి,
కూర్పు- ద్విభాష్యం రాజేశ్వరరావు,
నిర్వహణ- సుధామ,
ప్రచురణ: గంధకుటి,
పేజీలు-143, ధర: రూ. 180/-

వాస్తవిక జీవితానికి అద్దం పట్టే కథలు

ఈ కథామంజరిలో ప్రచురించిన కథలు పాతిక. పది కథలకు ఉగాది పురస్కారంగా వెయ్యిరూపాయలు బహుమానం అందించారు. ఈ కథలన్నీ హృదయాల్ని తట్టి తలపులు కలిగిస్తాయి. కరుడుకట్టిన మానవులను మహితాత్ములుగా తీర్చిదిద్దుతాయి. ఆ తీరు మార్గదర్శకంగా ఉంది. రచయితలు తమ కథల్లో తెలుగు వాని గుండెలు జల్లుమంటాయి. ఆయాపాత్రలు వాస్తవికజీవితంలో కనులముందు కనబడతాయి. నేను అనాధా శ్రమంలో ఉన్న భవ జలధిని మీరు దాటించారు. ఇప్పుడది 'చింతాజలధి'. ప్రతి వ్యక్తికి లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్యం నెరవేరాలని పట్టుబట్టి కార్యనిర్వహణలో మునిగిపోతాడు. అటువంటి మంచి మనుషుల ఆత్మకు శాంతి కలగాలని ప్రతిరోజు కోరుకుందాం మనం. అదే వారికి అసలైన నివాళి. 'ఆలంబన'లో. సాటి మనిషిని మనిషిగా చూశాడతడు. అదే 'పరమం పవిత్రం'. విజయం పరిచయంలేని అందలమెక్కిస్తుంది. ఓటమి నికార్సైన జీవితాన్ని అందిస్తుందంటారు. రచయిత ఒక పాత్ర చేత 'జీవన వేదం'లో. మఱ్ఱిచెట్టు ఎంతోమందికి నీడనిచ్చి సేద తీర్చుతుంది. ఆ పేరే 'మఱ్ఱిచెట్టు నీడ'. ఈతరం చిత్రమైంది. తనను తాను తెలుసుకోవటం, స్వేచ్ఛగా ఉండటం ఇవన్నీ ఈ తరంలో కన్పిస్తాయి. మన పల్లెలు సిసలైన భారతీయతకు పట్టుకొమ్మ. ఇప్పుడు వాడు సతి శరీరాన్ని మోస్తున్నాడు. అతడు రుద్రుడు కాదు. సతిని హృదయంలో దాచుకొన్న అర్ధనారీశ్వరుడు. వాడి శరీరం శవం కాదు, శివం అని ముగించారు. 'తల్లి వేరు' రచయిత. 'గురివింద' తనకున్న నలుపును గుర్తించదు. కాని ఎదుటివారిని ఎత్తి చూపుతుంది. ఇంకా పదిహేను కథల్లో సామాజిక చైతన్యం కలగాలని ఉద్ఘోషిస్తాయి.

గెల్లి రామమోహనరావు, 0863-2357514

గ్రంథ సమీక్ష

పేరుతో సహా కవితలలో కొత్తదనం

మహమ్మద్ ఖాజామైనద్దీన్ కలం నుండి వెలువడిన కవితా సంకలనం ఆమె మార్పు ఎజండా. కవితా సంకలనం పేరు కొంచెం కొత్తగా, కవితలు చదవదగినవిగా ఉన్నాయి. కవి తన ఆలోచనలను దాదాపు 60 కవితలలో పంచుకున్నారు. కవితలలో కొత్తదనం చూపేందుకు ప్రయత్నించారు. ఇందులో అక్షరం అనే కవితలో అక్షరం విలువ తెలుసుకో అంటూ సందేశాత్మకంగా సాగుతుంది. అక్షరం నేర్చుకొంటే బతుకు మారుతుంది అదే జీవితం అంటూ కవి తెల్పిన విధానం బాగుంది. అలాగే మరో కవిత బాల్యంలో... బాల్యం అనేది మరుపురానిది, తిరిగి రానిది అంటూ బాల్యం ఒక్కొక్కరికి ఒక్కోరకమైన జ్ఞాన పాకాన్ని ఇస్తుంది అంటూ కవిత ముగింపులో చేర్చిన మాటలు చూడండి 'బాల్య స్మృతులే/ జీవన సమరానికి/ బలాన్నిచ్చే ఔషధాలు' అంటూ ముగించారు. మరో ముఖ్య మంచి కవితగా కళాకారుని జీవన గమనం. ఇందులో కవి రాసినవి అక్షర సత్యాలు. కళాకారులు కలలో బతుకుతారు. ప్రశంసలతో జీవిస్తారు. ఆకలితో అలమటిస్తారు. అనేక ఇబ్బందులు పడతారు. కాని కళ కోసం బతుకుతారు అని తన మనసులోని భావాన్ని అక్షర రూపంలో అద్భుతంగా చెప్పారు. అలాగే మరో కవిత శ్రమలో శ్రమ చేసేవాడికి కష్టం, కాలం విలువ తెలుస్తుంది అంటూ మొదలుపెట్టి చివరలో రంగుల ప్రపంచంలోని దగాను/ ఎత్తి చూపుతుంది శ్రమ/ శ్రమను ఆయుధంగా చేసుకొని/ హక్కులకై పోరాడుతూ స్వేచ్ఛా గీతం పాడిస్తుంది శ్రమ అంటూ శ్రమ విలువను తెలియజేస్తారు నేటితరానికి. ఇంకా ఈ కవితా సంపుటిలో నిరుద్యోగ నిర్మూలన అయితేనే!, మా ఊరు, నాన్న వంటి అనేక కవితలు చదవాల్సిందే.

విష్ణుభొట్ల రామకృష్ణ, సెల్: 9440618122



ఆమె మార్పు ఎజండా,
కవి-మహమ్మద్ ఖాజామైనద్దీన్,
పేజీలు: 110, వెల: రూ.50/-,
ప్రతులకు: తెలంగాణా సాహితి,
హెచ్.నెం: 1-10-85/18,
సహషాబ్ గుట్ట, మహబూబ్‌నగర్.

హిమాచల్ సంక్షోభంలో కొత్త మలుపు

- స్వతంత్ర ఎమ్మెల్యే సహా అనేకమందిపై కేసులు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పందించిన రాష్ట్ర పోలీసులు
- బెదిరింపులకు లొంగేదిలేదన్న రెబెల్స్

సిమ్లా: హిమాచల్‌లో రాజ్యసభ ఎన్నిక రేపిన చిచ్చు కొనసాగుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు పార్టీ ఎమ్మెల్యేలు రాష్ట్రంలోని బీజేపీ అభ్యర్థికి ఓటు వేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి జారుకున్న సంగతి విదితమే. తదనంతర పరిణామాల నడుమ ఆదివారం తాజాగా ఒక స్వతంత్ర ఎమ్మెల్యే, మరొక కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యే తండ్రి, ఇతరులపై రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేయడం సంచలనం రేపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంజయ్ అవస్తీ, భువనేశ్వర్ గౌర్ చేసిన ఫిర్యాదు మేరకు హమీర్‌పూర్ స్వతంత్ర ఎమ్మెల్యే ఆశిష్ శర్మ, గాగ్రెట్ ఎమ్మెల్యే చెతన్య శర్మ (ఇప్పుడు అనర్హత వేటు పడిన ఎమ్మెల్యే)తండ్రి తదితరులపై కేసు నమోదైంది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు అనుకూలంగా ఓటు వేసిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులతో సహా తొమ్మిది మంది ఎమ్మెల్యేలలో ఆశిష్, చెతన్య ఉన్నారు. కాగా ఈ వ్యవహారంలో రిటైర్డ్ బ్యూరోక్రాట్ అయిన చెతన్య తండ్రి పాత్ర ఏ మేరకుఉందనేది తెలియరాలేదు. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదుపై నేరపూరిత కుట్ర, అవినీతి, ఎన్నికలపై మితిమీరిన ప్రభావం ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

కాగా ఈ పరిణామంపై కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. ఈ వైఖరితో భవిష్యత్తులో జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు సీఎం సిద్ధంగా ఉండాలంటూ ఆరుగురు తిరుగుబాటు ఎమ్మెల్యేల్లో ఒకరైన రాజిందర్ రాణా అన్నారు. ఒత్తిడి వ్యూహాలు పనిచేయవని, ఇలాంటి రాజకీయాల వల్లే ఎమ్మెల్యేలు బీజేపీకి అనుకూలంగా ఓటు వేయాల్సి వచ్చిందని రానా ఆదివారం ఫోన్‌లో పీటీఐతో అన్నారు. అయితే డబ్బు లావాదేవీలు, హెలికాప్టర్, భద్రతా దళాల దుర్వినియోగం, నేరపూరిత దుష్ప్రవర్తన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు హర్యానా, ఉత్తరాఖండ్‌లోని ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో విడిది, హెలికాప్టర్ల ద్వారా రవాణ కోసం బీజేపీ చెల్లింపులు జరుపుతున్నట్లు ప్రత్యక్ష ఆధారాలున్నాయని వారు చెప్పారు. కాంగ్రెస్ తిరుగుబాటుదారులు, స్వతంత్రులతో పాటు బీజేపీ శాసనసభ్యులు వచ్చినట్లు తగిన సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీతా సోరెన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పును వారు ఫిర్యాదులో ఉదహరించారు. సంజయ్ అవస్తీ పీటీఐతో మాట్లాడుతూ... ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు రాష్ట్రంలో ఎన్నడూ జరగలేదన్నారు. డబ్బు, ప్రలోభాలకు పాల్పడిన ఎన్నికైన ప్రజాప్రతినిధులు క్రిమినల్ చర్యలకు అతీతులు కారని సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చిందని... ఈ క్రమంలో దర్యాప్తును కోరుతున్నామని అన్నారు. కాగా బోయిలౌగంజ్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల నుండి ఫిర్యాదు అందిందని షిమ్లా పోలీసు సూపరింటెండెంట్ సంజీవ్ కుమార్ గాంధీ పీటీఐకి తెలిపారు, ఐపీసీ సెక్షన్ 171 ఎ, సి (ఎన్నికల మీద అనవసర ప్రభావం), 120-బి (నేరపూరిత కుట్ర), అవినీతి నిరోధక చట్టం, 1988లోని సెక్షన్లు 7, 8 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా బీజేపీకి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ చేసిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుధీర్ శర్మ, రవి ఠాకూర్, రాజిందర్ రాణా, ఇందర్ దత్ లఖన్‌పాల్, చెతన్య శర్మ, దేవిందర్ కుమార్ భుట్టోలపై స్పీకర్ అనర్హత వేటు వేయగా... వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరితో పాటు ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు మొత్తం 11మంది ఓ ప్రత్యేక విమానంలో హర్యానాలోని పంచ్‌కుల నుంచి బయల్దేరి రిషికేశ్ చేరుకున్నారు. స్థానికంగా ఉన్న హొటల్ తాజ్‌లో బస చేశారు. వీరంతా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) రక్షణలో ఉన్నారు. వీరు ఆదివారం సాయంత్రం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా మద్దతు లేదని ఆరోపించారు. ఎమ్మెల్యేలుగా ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నామన్నారు. ఓ వైపు రాజీ కోసం తమను సంప్రదించి... మరోవైపు నల్ల పాములు, గొర్రెల కాపరులు అని ప్రకటనలు ఇస్తున్న సీఎం బుద్ధి ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చెందిన ఆరు నల్ల పాములు తమ పరువును అమ్ముకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించాయని, ఆ తర్వాత వారిని ఒక చోటి నుంచి మరో చోటికి తరలిపోయే గొర్రెల కాపరులతో పోల్చుతూ బహిరంగ సభల్లో సీఎం సుఖూ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఏఐసీసీ కార్యదర్శి పదవి నుంచి సుధీర్ శర్మను తొలగించగా... హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజిందర్ రాణా రాజీనామా చేశారు.

11,12న దేశవ్యాప్త ఆందోళన

- ఢిల్లీలో ముస్లింలపై పోలీసుల అరాచకానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) పిలుపు

న్యూఢిల్లీ: దేశంలో మతోన్మాదం పేట్రేగిపోతోందని, పోలీసు/భద్రతా దళాలు సైతం మతం రంగు పులుముకునే పరిస్థితులు నెలకొన్నాయని సీపీఐ (ఎంఎల్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో నమాజ్ చేస్తున్న ముస్లింలపై ఖాకీ క్రౌర్యమే ఇందుకు నిదర్శనమని పేర్కొంది. ప్రార్థన సమయంలో మసీదులో ఖాళీ లేక రోడ్డు పక్కన కొందరు నమాజ్ చేస్తుండగా ఓ పోలీసు అధికారి వారిపై భౌతిక దాడికి దిగి బూటు కాలుతో తన్నడం, మెడ పట్టుకొని పక్కకు లాగేందుకు యత్నించడాన్ని తీవ్రంగా ఖండించింది. ముస్లింలపై పోలీసుల అరాచకాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 11,12 తేదీల్లో దేశవ్యాప్త ఆందోళనకు సీపీఐ(ఎంఎల్) పిలుపునిచ్చింది. 'పోలీసు దమనకాండ/ఆటవికత నసించాలి. విద్వేషాన్ని-భద్రతా దళాల వర్గీకరణను ఆపాలి, ఢిల్లీ పోలీస్... విద్వేష పోలీస్, సంవిధాన్ బచావో... బీజేపీ హటావో' అంటూ 'ఎక్స్' మాధ్యమంగా నినాదాలిచ్చింది. 11,12 తేదీల్లో చేపట్టబోయే దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) కోరింది.

ఇసుక మైనింగ్ కేసులో

లాలు సన్నిహితుడి అరెస్టు

- శుభాష్ యాదవ్ ఆస్తుల సోదా
- ఎనిమిది చోట్ల 14 గంటల పాటు ఈడీ తనిఖీలు



న్యూఢిల్లీ: రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సన్నిహితుడు, పార్టీలో కీలక నాయకుడు శుభాష్ యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. అక్రమ ఇసుక మైనింగ్ కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. అంతకుముందు యాదవ్ ఆస్తులను ఈడీ అధికారులు సోదా చేశారు. ఎనిమిది చోట్ల 14 గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. మనీలాండరింగ్ చట్టం (పీఎంఎల్‌ఏ) కింద బ్రాడ్‌సన్స్ కమోడిటీస్ ప్రై.లి (బీసీపీఎల్)పై 20 ఎఫ్‌ఐఆర్‌లను బీహార్ పోలీసులు నమోదు చేసిన ఆధారంగా ఈడీ ఈ మేరకు చర్యలు చేపట్టింది. శుభాష్ యాదవ్ బీసీపీఎల్ డైరెక్టర్. బీసీపీఎల్ అక్రమంగా ఇసుక మైనింగ్ చేయడమే కాకుండా ఈ-చలాన్లు లేకుండా అమ్మకాలు సాగిస్తున్నట్లు ఎఫ్‌ఐఆర్‌లు పేర్కొన్నాయి. పర్యావరణ నిబంధనల అతిక్రమణను ప్రస్తావించాయి. అక్రమంగా ఇసుకను అమ్మడం ద్వారా రూ.161 కోట్లు ఆర్జించినట్లు దర్యాప్తులో తేలింది. ఇసుక దందాను సిండికేట్ నడుపుతున్నదని, శుభాష్ యాదవ్ ఇందులో కీలక సభ్యుడని వెల్లడైంది. బీసీపీఎల్ వంటి కంపెనీల్లో పెట్టుబడుల పెట్టి, అక్రమ ఇసుక అమ్మకాల ద్వారా సభ్యులు లబ్ధి పొందుతున్నారని తేలింది. పాట్నాలోని ఆరు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించి రూ.2.3 కోట్ల నగదు, నేరపూరిత పత్రాలను శనివారం స్వాధీనపర్చుకుంది. అదే రోజు రాత్రి శుభాష్ యాదవ్ అరెస్టయ్యారు. ఐటీ అధికారులు కూడా యాదవ్ ఆస్తులను సోదా చేశారు.

హర్యానాలో బీజేపీకి షాక్

కాంగ్రెస్‌లో చేరిన హిసార్ ఎంపీ

చండీగఢ్/న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ కి హర్యానాలో షాక్ తగిలింది. హిసార్ ఎంపీ బ్రిజేంద్ర సింగ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఆదివారం రాజీనామా చేశారు. రాజకీయ కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. ఆ వెనువెంటనే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్ తనయుడైన బ్రిజేంద్ర సింగ్ నేరుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసానికి వెళ్లి ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం బ్రిజేంద్ర సింగ్ మీడియాతో మాట్లాడుతూ... తాను బీజేపీని వీడడానికి బీజేపీ-జేజేపీ పొత్తు ఒక కారణమని చెప్పారు. పార్లమెంటు సభ్యుడిగా హిసార్ నియోజకవర్గానికి సేవలందించే అవకాశం కల్పించిన బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో కృతజ్ఞతలు తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో హిసార్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన బ్రిజేంద్ర సింగ్ ఆ ఎన్నికల్లో జేజేపీ అభ్యర్థి దుష్యంత్ చౌతాలా, కాంగ్రెస్ అభ్యర్థి భవ్య బిష్ణోయ్‌పై గెలుపొందారు.

చండీగఢ్‌లో బీజేపీకి భంగపాటు

- ఎంసీలో 'ఇండియా'కు దక్కిన మెజారిటీ
- తిరిగొచ్చిన ఆ ఇద్దరు ఆప్ కౌన్సిలర్లు

చండీగఢ్: చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీ)లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి భంగపాటు కలిగింది. పార్టీ ఫిరాయించిన ఇద్దరు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్లు పూనం, నేహా తిరిగి సొంతగూటికి వచ్చారు. దీంతో ఇండియా కూటమికి బలం చేకూరింది. ఎంసీలో మెజారిటీ దక్కింది. దీంతో ఎంసీలో నాటకీయ పరిణామాలకు తెరపడినట్లు అయ్యింది. దీంతో ఆప్ మేయర్ కుల్దీప్ కుమార్‌ను పదవి నుంచి దించాలనే బీజేపీ ప్రయత్నం విఫలమైంది. పూనం, నేహా గత నెలలో బీజేపీలోకి వెళ్లిన విషయం తెలిసిందే. వీరితో పాటు పార్టీ ఫిరాయించిన మరొక ఆప్ కౌన్సిలర్ గురుచరణ్ సింగ్ కాలా బీజేపీలోనే ఉన్నారు. ఆయనను తిరిగి తీసుకొచ్చే కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. కాగా, మేయర్ ఎన్నికల్లో రిగ్గింగ్ క్రమంలో సుప్రీంకోర్టు గత నెలలో కుల్దీప్ కుమార్‌ను విజేతగా ప్రకటించింది. ఇండియా కూటమికి అనుకూలంగా తీర్పు రావడంతో బీజేపీ తలదించుకోవాల్సి వచ్చింది. చండీగఢ్ ఎంసీలో 35 మంది సభ్యులున్నారు. తాజా పరిణామం ఆప్-కాంగ్రెస్ కూటమికి అనుకూలంగా మారింది. ప్రత్యర్థి బీజేపీ తమ మేయర్‌ను తప్పిస్తుందన్న భయం తొలగిపోయింది. ఆప్ కౌన్సిలర్లు ముగ్గురు కాషాయ కండువా కప్పుకోవడంతో ఎంసీలో మెజారిటీ కోల్పోయిన 'ఇండియా'కు తిరిగి మెజారిటీ లభించింది. అయితే సుప్రీం తీర్పుకు ముందే ఈ కౌన్సిలర్లను బీజేపీ తన ముగ్గులోకి దించేసింది. సుప్రీంకోర్టు తీర్పు ఇండియా కూటమికి అనుకూలంగా రావడం, కౌన్సిలర్లు పూనం, నేహా ఆప్ గూటికి తిరిగి చేరుకోవడంతో బీజేపీ డీలా పడిపోయింది. ప్రస్తుతం ఆప్‌కు 12, కాంగ్రెస్‌కు ఏడుగురు కలిపి మొత్తం 19 మంది కౌన్సిలర్లు ఉన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ఓఎస్‌డీ రాజ్‌బీర్ సింగ్ ఘుమ్మన్, ఆమ్ ఆద్మీ పార్టీ చండీగఢ్ సహ-ఇన్‌చార్జి సన్నీసింగ్ అహ్లూవాలియా సమక్షంలో పూనం, నేహా తిరిగి ఆప్‌లో చేరారు. కలిసి ప్రయాణించే సమయంలో కొన్ని మనస్పర్థలు సహజమేనని, వాటిని మర్చి తిరిగి వచ్చామని, పార్టీతో తమకు ఎలాంటి సమస్యలు లేవని పూనం, నేహా ఈ సందర్భంగా చెప్పారు.

సీపీఎంలో చేరిన బీజేపీ కేరళ మాజీ కార్యదర్శి నజీర్

త్రివేండ్రం: బీజేపీ కేరళ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఏకే నజీర్ ఎర్ర కండువా కప్పుకున్నారు. సీపీఎంలో చేరారు. త్రివేండ్రంలోని ఏకేజీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ అరుణ శాలువా కప్పి ఆయనను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మైనారిటీలతో బీజేపీ ప్రవర్తించే తీరుతో పాటు అనేక అంశాల్లో ఆ పార్టీ వైఖరిని అంగీకరించలేక సీపీఎంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు నజీర్ ఈ సందర్భంగా తెలిపారు.

బోరుబావిలో పడ్డ 30 ఏళ్ల వ్యక్తి మృతి

ఎన్డీఆర్ఎఫ్ ప్రయత్నాలు విఫలం

న్యూఢిల్లీ: ఢిల్లీ జల్‌బోర్డుకు చెందిన నీటి శుద్ధి కేంద్రంలోని బోరుబావిలో పడిన వ్యక్తి మృతి చెందాడు. వ్యక్తిని కాపాడేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

ఎన్డీఆర్ఎఫ్ బృందాలు 12 గంటలపాటు శ్రమించిన తర్వాత మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బోరుబావి నుంచి బాధితుడిని బయటకు తీశాయి. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. బోరుబావిలో పడిపోయిన వ్యక్తి మృతదేహాన్ని సహాయ బృందాలు బయటకు తీశాయని మంత్రి ఆతిశి తెలిపారు. బావిలో మృతుడు ఎలా పడిపోయాడన్న విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తారని చెప్పారు. సహాయ ఆపరేషన్ చేపట్టిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆతిశి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అంతకుముందు బోరుబావిలో వ్యక్తి పడిపోవడం దురదృష్టకరమని మంత్రి ఆతిశి ఢిల్లీ ప్రిన్సిపల్ సెక్రటరీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించారు. సకాలంలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగించని అన్ని బోరుబావులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. 48 గంటల్లో తనకు నివేదిక సమర్పించాలని తెలిపారు. అసలేమైందంటే... పశ్చిమ ఢిల్లీలోని కేశోపూర్ మండిలో 40 అడుగుల బోరుబావిలో ప్రమాద వశాత్తు వ్యక్తి పడిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే బోరుబావిలో పడింది చిన్నారి అని మొదట అంతా అనుకున్నప్పటికీ ఓ వ్యక్తి బావిలో పడ్డారని అధికారులు నిర్ధరించారు. ఈ ఘటనపై తమకు అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత సమాచారం అందిందని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ తెలిపారు.

నెరవేరని నోటా లక్ష్యం

నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ : నోటా (ఎవ్వరికీ ఓటు వెయ్యకుండా తిరస్కరించడం) కోరల్లేని పులి లాంటిదని నిపుణులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం 'నోటా'ను పదేళ్ల క్రితమే ప్రవేశపెట్టినప్పటికీ ప్రస్తుతం నోటా కేవలం ఒక అలంకార ప్రాయంగా మాత్రమే మిగిలిపోయింది, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలుస్తున్న నేరస్థుల సంఖ్య పెరుగుతున్నది. దాని లక్ష్యం మాత్రం నెరవేరలేదు. ఎక్కువమంది ఓటర్లు ఈ బటన్‌ను ఉప యోగించడంలేదు. ఎందుకంటే వాటిపై చర్యలు లేవు. ఓటు వెయ్యడానికి వెళ్లినప్పుడు ఈవీఎంలలో 'నోటా' అనే బటన్ కూడా ఉంటుంది, అక్కడ జాబితాలో ఉన్న ఏ అభ్యర్థికీ ఓటు వేయడం ఓటరుకు ఇష్టం లేకపోతే ఆ బటన్ నొక్కుతారు, కానీ, ఈ బటన్‌ను నొక్కే ఓటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది, ఈ బటన్ నొక్కినా ఆ ఓటుకు ఎంతమాత్రం విలువ లేకుండా పోతున్నది, ఈ ఓటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు, వారికి విలువ ఇవ్వడంలేదు అని నిపుణులు విమర్శిస్తున్నారు. "నేరస్తులు అని చెప్ప డానికి, నోటాకు తేడా ఏమీ లేదు, నోటా బటన్ నొక్కితే దాని అర్థం అదే, కానీ గెలిచిన అభ్యర్థులలో నేరస్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది" అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అధినేత మేజర్ జనరల్ (రిటైర్డ్) అనిల్ వర్మ పీటీఐతో అన్నారు. రాజకీయపార్టీలపైన, అభ్యర్థుల పైనా ఒత్తిడి తీసుకురావడమే నోటా ప్రధాన ఉద్దేశం. కళంకితులలైన వారిని అభ్య ర్థులుగా పోటీకి నిలుపవద్దని ఓటర్లు తమ అసమ్మతిని తెలియజేస్తారు. దీనిని పార్టీలు గమనించి చర్యలు చేపట్టాలి అని ఆయన అన్నారు. కానీ ఓటర్లు పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేయడానికి తప్ప ఇంక దేనికీ ఈ నోటా ఉప యోగపడటంలేదని, ఈ అసమ్మతికి చట్టబద్ధమైన కోరలు లేవని వర్మ విమర్శించారు. "నోటాను మరింత కట్టుదిట్టం చేయాలి, బలమైన కోరలు నోటాకు ఉండాలి" అని యాక్సిస్ ఇండియా ఛైర్మన్ ప్రదీప్ గుప్తా అన్నారు. ఏడీఆర్ నివేదిక ప్రకారం వివిధ ఎన్నికల్లో 0.5 నుంచి 1.5 శాతం వరకూ ఓటర్లు నోటా ద్వారా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. 2019 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో 1.06 శాతం ఓటర్లు నోటాను ఉపయోగించారు. 2018లో అత్యధికంగా చండీగఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో 1.98 శాతం మంది ఓటర్లు నోటాను ఉపయోగించారు. లక్షద్వీప్‌లో అతి తక్కు వగా 100 మంది లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు. ఈ 'నోటా' బటన్ నొక్కి ఓటర్లు తమ అసమ్మతిని, అసంతృప్తినీ ప్రకటించినప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకోవడంలేదు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా 2013లో దేశంలో నోటాను ప్రవేశపెట్టారు. నేరస్తులు, కళంకిత చరిత్రగల వ్యక్తులను రాజకీయపార్టీలు ఎన్నికల బరిలో నిలబె ట్టకుండా నిరుత్సాహపరచడంకోసం ఈ 'నోటా'ను ప్రవేశపెట్టారు. బ్యాలట్ పత్రాల్లో లేదా ఈవీఎంలలో నోటా అనివార్యంగా ఉండాలని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో గణనీయ వృద్ధి

న్యూఢిల్లీ: గత పదేళ్లలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి పరంగా భారత్ గణనీయమైన వృద్ధిని సాధించింది. 2014లో దేశంలో విక్రయించిన మొత్తం మొబైల్ ఫోన్‌లలో 78 శాతం దిగుమతి చేసుకోగా... ఇప్పుడు 97 శాతం మొబైల్ ఫోన్‌లు భారత్‌లోనే తయారవుతున్నాయని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) నివేదిక పేర్కొంది. మొబైల్ ఫోన్ల ఉత్పత్తి విలువ 2014-15లో రూ.18,900 కోట్లు కాగా 2024లో అది 21 రెట్లు పెరిగి రూ.4.1 లక్షల కోట్లకు చేరుకుంది. గత పదేళ్లలో దేశంలో 245 కోట్లకు పైగా మొబైల్ ఫోన్ల ఉత్పత్తి జరిగినట్లు వివరించింది. 2014-15లో భారత్ నుంచి మొబైల్ ఫోన్ ఎగుమతుల విలువ కేవలం రూ.1,556 కోట్లు మాత్రమే కాగా, 2024 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అది రూ.1,20,000 కోట్లకు చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది.

2014లో భారత్‌లో కేవలం రెండు మొబైల్ ఫ్యాక్టరీలు ఉండగా, ప్రస్తుతం అనేక పరిశ్రమల ఏర్పాటుతో దేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ ఉత్పత్తిదారుగా అవతరించింది. శాంసంగ్ నోయిడాలో ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ ఫోన్ ఫ్యాక్టరీని నిర్వహిస్తోంది. మరోవైపు యాపిల్ కూడా కొత్త ప్లాంట్‌లను ఏర్పాటుచేసింది. భారత్‌లో తయారైన పరికరాలను ఉత్తర ఆఫ్రికా, దక్షిణ అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్స్, ఆస్ట్రియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పెరుగుతున్న ఎగుమతి మార్కెట్‌తో, భారత్ మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్స్ తయారీ ఔట్‌లుక్ ఆరోగ్యకరంగా ఉందని నిపుణులు పేర్కొన్నారు.

అభివృద్ధి చూసి ఇండియా కూటమి బెంబేలు: మోదీ

ఆజంగఢ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని తాము చేసిన అభివృద్ధి... ఓటు బ్యాంకుపై ఆధారపడిన ప్రతిపక్ష ఇండియా కూటమికి నిద్ర లేకుండా చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అభివృద్ధి జరుగుతున్న కొద్దీ వారి దుష్ప్రచారం బలహీనపడుతోందని విమర్శించారు. తనకు కుటుంబం లేదంటున్నారని, కానీ దేశంలోని 140 కోట్లమంది ప్రజలు 'మోదీ కా పరివార్' అని వారు మరిచిపోయారని చెప్పుకొచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రూ.34,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి ప్రసంగించారు. 7 ఏళ్లలోనే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రాష్ట్రం బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. 'ఆజంగఢ్ ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతం. ఇప్పుడు అభివృద్ధిలో దేశంలోనే కొత్త అధ్యయాన్ని లిఖిస్తోంది. ఈ ప్రాజెక్టులను మేము శంకుస్థాపనలు చేశాం. అవి ఎన్నికల కోసం చేయలేదు. 2024లోనూ వీటిని ఎన్నికల దృష్టిలో చూడొద్దు. అభివృద్ధి కోసం నేను చేస్తున్న ఉద్యమం ఇది. 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలనే సంకల్పంతో వేగంగా పరుగులు పెడుతున్నా. అంతే వేగంగా దేశాన్ని పరుగెత్తిస్తున్నా' అని మోదీ పేర్కొన్నారు.

15 విమానాశ్రయ ప్రాజెక్టులు

ఉత్తర్‌ప్రదేశ్ పర్యటనలో భాగంగా రూ.10,000 కోట్ల విలువైన 15 విమానాశ్రయాల ప్రాజెక్టుతో పాటు 12 టెర్మినల్ భవనాలకు ప్రధాని ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశారు. ఆజంగఢ్, శ్రవస్తి, చిత్రకూట్, అలీగఢ్ విమానాశ్రయాలు, చౌధరీ చరణ్‌సింగ్ టెర్మినల్‌తో పాటు ఆజంగఢ్‌లో మహారాజా సుహేల్ దేవ్ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. రూ. 11,500 కోట్ల వ్యయంతో చేపట్టిన ఐదు ప్రధాన జాతీయ రహదారులకు శంకుస్థాపనలు చేశారు. పీఎం గ్రామ్ సడక్ యోజన ద్వారా యూపీలోని 59 జిల్లాల్లో 5,342 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రోడ్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. రూ.8,200 కోట్ల విలువ చేసే 12 రైల్వే ప్రాజెక్టులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. నమామి గంగా యోజన ద్వారా ప్రయాగ్‌రాజ్, ఇటవా, జౌన్‌పుర్ జిల్లాల్లో మురుగునీటిని శుద్ధిచేసే ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేశారు. లఖ్‌నవూలో ఆధునిక వసతులతో నిర్మించిన వెయ్యికిపైగా గృహాలకు చెందిన లైట్ హౌజ్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ ప్రారంభించారు.

గత ప్రభుత్వం ప్రజల కళ్లలో దుమ్ము కొట్టిందని ఆరోపించారు. తాము దేశంలో అనేక రైల్వే స్టేషన్లు ఏకకాలంలో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోపాటు పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోల్డ్ అప్రైజర్లకు పని భద్రత కల్పించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: గోల్డ్ అప్రైజర్లకు పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిద్ధార్థ అకాడమి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఆల్ బ్యాంకు గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అటు యాజమాన్యానికి, ఇటు ప్రజలకు మధ్యవర్తిగా పనిచేస్తూ బ్యాంకుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న అప్రైజర్లకు కనీస వసతులు, సదుపాయాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కూడా కల్పించకపోవడం దుర్మార్గం అన్నారు. బ్యాంకు యజమానులు, అధికారులు రుణాల పేరుతో ఉద్యోగులను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అప్రైజర్లు పని భారంతో మానసికంగా తీవ్ర అనారోగ్యం పాలైనా యాజమాన్యాలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అప్రైజర్ల ద్వారా కొన్ని లక్షల కోట్లు బ్యాంకు యాజమాన్యం ఆర్జిస్తోందన్నారు. అలాంటి అప్రైజర్లకు బ్యాంకు ఉద్యోగ భద్రత లేకపోవడం అన్యాయం అన్నారు. బ్యాంకు యాజమాన్యాల నిరంకుశత్వంపై భవిష్యత్తులో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోందని తెలిపారు. దాని ఫలితమే బ్యాంకు ఉద్యోగులతో పాటు బ్యాంకు మీద ఆధారపడిన ప్రజలు కూడా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. పాలకవర్గాల నిర్ణయాల వల్ల లక్షల కోట్ల రూపాయలు రుణాలు తీసుకున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గం అన్నారు. బ్యాంకు ఉద్యోగులకు రావలసిన 12వ పీఆర్సీగానీ, ఇతర సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కేంద్రం ప్రభుత్వ రంగ బ్యాంకులను కూడా ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలని కోరారు. తొలుత ఆంధ్ర ప్రదేశ్ ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ అధ్వర్యంలో స్థానిక గాయత్రి నగర్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, శంకర కంటి హాస్పిటల్ రోడ్డు నుంచి సిద్ధార్థ అకాడమీ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీనీ ఏఐబీఈఏ నాయకులు బి.ఎస్.రాంబాబు, నాయకులు రవీంద్రనాథ్, ఉదయ కుమార్, ఏబీజీఏయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పడాల రమణ జెండా ఊపి ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం అప్రైజర్ల జెండాను రాంబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పడాల రమణ, అధ్యక్షుడు వైఎస్ ప్రకాష్ ఆచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగపద్మ, నాయకులు రమేష్, ఏడుకొండలు, రంగాచారి, పెట్ల గోపి, ప్రభాకర్, సాయి కృష్ణ, నాగరాజు, నరేంద్రతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అప్రైజర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైనారిటీల హక్కులు పరిరక్షించండి

- దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయొద్దు
- మోదీ ప్రభుత్వానికి ఐరాస మానవ హక్కుల నిపుణుల వినతి

న్యూఢిల్లీ: మత విద్వేషాలను ప్రోత్సహించవద్దని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నిపుణులు మోదీ ప్రభుత్వాన్ని కోరారు. వివక్షకు తావివ్వవద్దని, హింసను ప్రేరేపిం చవద్దని సూచించారు. మత మార్పిడుల నిరోధక చట్టాన్ని రద్దు చేసి మైనారిటీల మత స్వేచ్ఛను కాపాడాలని ఐరాస ప్రత్యేక పాత్రికేయులు, స్వతంత్ర నిపుణులు, కార్యాచరణ బృందాల ప్రతినిధులు ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వివక్షకు తావులేని చట్టాలను రూపొందించాలని ఆ ప్రకటనలో వారు ప్రభుత్వాన్ని కోరారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని, మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అడ్డుకోవాలని, బాధితులకు అండగా నిలవాలని సూచించారు. మైనారిటీల నివాసాల కూల్చివేతలను నిలువరించి, అందుకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణం పేరిట ప్రజలను బలవంతంగా నిర్వాసితులను చేయడానికి అడ్డుకట్ట వేయాలని కోరారు. అసోంలో బెంగాలీ సంతతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పౌరసమాజ కార్యకర్తలు, బృందాలకు వ్యతిరేకంగా ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని ఐరాస మానవ హక్కుల నిపుణులు ఆ ప్రకటనలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పౌర సమాజం స్వేచ్ఛగా తన కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. పక్షపాతపూరిత ఉద్దేశాల కోసం అధికారిక వనరులను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని, సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని, అందుకు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు.

జార్ఖండ్‌లో 8 స్థానాల్లో సీపీఐ పోటీ

16న అభ్యర్థుల ప్రకటన

రాంచీ: జార్ఖండ్‌లో ఒంటరిగా పోటీ చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సిద్ధమైంది. రాష్ట్రంలో ఇండియా కూటమితో విడిపోయింది. మొత్తం 14కుగాను ఎనిమిది లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేయబతోతున్నట్లు ఆదివారం ప్రకటించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర పాథక్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఐ ఒంటరిగా పోటీ చేస్తుందని, ఎనిమది స్థానాలకు అభ్యర్థులను ఈనెల 16న ప్రకటిస్తామన్నారు. 'బీజేపీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్, మహాకూటమి ఇప్పటివరకు సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రారంభించలేదు. కాబట్టి ఒంటరిగా బరిలో దిగాలని నిర్ణయించాం' అని మహేంద్ర తెలిపారు. రాంచీ, హజారీబాగ్, కొడెర్మ, ఛాత్ర, పలము, గిరిధ్, దుంకా, జంషెడ్ పూర్‌లో పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. కాగా, జార్ఖండ్ నుంచి పార్లమెంటు దిగువసభకు సీపీఐకి ప్రాతినిధ్యం లేదు. రాష్ట్రంలోని 14 స్థానాల్లో బీజేపీకి 11, ఏజేఎస్‌యూ, జేఎంఎం, కాంగ్రెస్‌కు చెరో స్థానంలో ప్రాతినిధ్యం ఉన్నది. కాంగ్రెస్ ఏకైక ఎంపీ గీతా కోరా ఇటీవల బీజేపీలో చేరారు.

బెంగాల్‌లో మమత ఒంటరి పోరు!

- 42 లోక్‌సభ స్థానాలకూ టీఎంసీ అభ్యర్థుల ప్రకటన
- క్రికెటర్లు యూసఫ్ పఠాన్, కీర్తి ఆజాద్‌కు చోటు
- మాజీ ఎంపీ మొయిత్రా, నటి రచనా బెనర్జీకి అవకాశం

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిర్ణయించారు. 'ఇండియా' కూటమి పార్టీలకు చోటు లేకుండా పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలకు అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఆదివారం అభ్యర్థులను ప్రకటించింది. బహరంపూర్ నుంచి పార్టీ అభ్యర్థిగా టీమిండియా మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, కృష్ణానగర్ నుంచి మాజీ ఎంపీ మహువా మొయిత్రా మరోసారి బరిలో నిలిచారు. అలాగే, హుగ్లీ నుంచి నటి రచనా బెనర్జీకి అవకాశం కల్పించారు. ఆమె తెలుగులో బావగారు బాగున్నారా?, కన్యాదానం, మావిడాకులు చిత్రాల్లో నటించారు. తొలుత కోల్‌కతా లోని బ్రిగేడ్ పరేడ్ మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభ నుంచి రాబోయే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల జాబితాను టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. అవినీతి ఆరోపణలపై పార్లమెంటు సభ్యత్వం కోల్పోయిన మహువా మొయిత్రా మరోసారి కృష్ణానగర్ నుంచి పోటీ చేయనున్నారు. ఎనిమిది మంది సిట్టింగ్‌లను పక్కకు తప్పించారు. సందేశ్‌ఖలీ ఉద్రిక్తతల నేపథ్యంలో బసిర్హత్ లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ నుస్రత్ జహాన్‌ను పక్కనపెట్టి మాజీ ఎంపీ హాజీ నూరుల్‌కు అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా బెనర్జీ మాట్లాడుతూ 'ఈరోజు బెంగాల్‌లోని 42 లోక్ సభ స్థానాలకు 42 మంది అభ్యర్థులను మీ ముందుకు తీసుకువస్తాను' అని తెలిపారు. ఈ సభకు లక్షలాది మంది మద్దతుదారులు, అనేక మంది బ్లాక్ స్థాయి నాయకులు హాజరయ్యారు. 'జన గర్జన్ సభ'గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రాస్ ర్యాంప్‌తో సహా మూడు వేదికలను ఏర్పాటు చేశారు. మమతా బెనర్జీ, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ప్రధాన వక్తలుగా ఉన్నారు. బెంగాల్‌లో 'ఇండియా' ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పారు. అలాగే అసోం, మేఘాలయలో కూడా పోటీ చేస్తున్నామన్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఒక లోక్‌సభ స్థానంలో పోటీ చేసేందుకు అఖిలేశ్ యాదవ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీతో తమ పార్టీ చర్చలు జరుపుతోందని ఆమె తెలిపారు. రాష్ట్రంపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'నేను న్యాయ వ్యవస్థను గౌరవిస్తాను. కానీ, కొంతమంది బీజేపీ ఏజెంట్లుగా పని చేశారు' అని కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయపై విరుచుకుపడ్డారు. ఆయన ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

ఏ సమయంలోనైనా పొత్తు ఏర్పడవచ్చు: ఖర్గే

రాష్ట్రంలో అన్ని లోక్‌సభ స్థానాల నుంచి టీఎంసీ అభ్యర్థులను ప్రకటించిన వెంటనే, నామినేషన్ల ఉపసంహరణ వరకు పొత్తుకు తలుపులు తెరిచి ఉన్నాయని కాంగ్రెస్ ఆదివారం తెలిపింది. ఏ ఒప్పందమైనా చర్చల ద్వారానే ఖరారు కావాలని, ఏకపక్ష ప్రకటనల ద్వారా కాదని పేర్కొంది. 'మా తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. నామినేషన్ల ఉపసంహరణకు ముందు ఎప్పుడైనా పొత్తు జరగవచ్చు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీతో గౌరవప్రదమైన సీట్ల భాగస్వామ్య ఒప్పందాన్ని కలిగి ఉండాలని కాంగ్రెస్ పార్టీ తన కోరికను అనేక సార్లు ప్రకటించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ఇండియా' కూటమి బృందం కలిసి బీజేపీతో పోరాడాలని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకుంటోంది' అని ఆయన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో తెలిపారు. ఇదిలాఉండగా, పశ్చిమ బెంగాల్‌లో సీట్ల పంపకంపై కాంగ్రెస్, టీఎంసీ నాయకులు ఇటీవలి కాలంలో పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ కాంగ్రెస్‌కు రెండు సీట్ల కంటే ఎక్కువ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. రాష్ట్రం నుంచి కాంగ్రెస్‌కు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. అయితే టీఎంసీ 'ఇండియా' కూటమిలో భాగం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్ష పార్టీలు ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి.

ఉపాధి కూలీలకు ఒక పూటే హాజరు

సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఉపాధి కూలీలు ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం పని చేస్తున్న ప్రాంతాల్లో తప్పని సరిగా ఫోటోలు తీయించుకోవాలనే పద్ధతిని తక్షణం ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి వచ్చిన ఉపాధి కూలీలు పరకడుపున వచ్చి మధ్యాహ్నం వరకు ఉండాలంటే ఆకలి బాధలకు తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని అందువల్ల రెండు పూటల హాజరు విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఒక్కపూట హాజరు వేసే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండల పరిధిలోని వెలగలగూడెం, బూరుగగూడెం, రెడ్డికుంట, రంగాపురం తదితర గ్రామాల పరిధిలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రెండు రోజులు పర్యటించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించటంతో పాటు కూలీల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కూలీలు తన దృష్టికి తీసుకువచ్చి వివరాలను కోటేశ్వరరావు ఆదివారం విలేకర్లకు వివరించారు. గతంలో 20 మంది కూలీలతో ఒక గ్రూపు ఏర్పరిచారని అప్పుడు సుమారు 5 సంవత్సరాల క్రితం ఒక్కో గ్రూపుకు 4 పలుగులు ఇచ్చారని, ఆ తరువాత గ్రూపులో మరో 20 మందిని కలిపి 40 మంది అయినా ఆ నాలుగు పాలుగులతోనే పని చేయమంటున్నారని తెలిపారు. ఈ పనులకు తప్పనిసరిగా అవసరమైన పారలు, గొడ్డళ్లు, కత్రకత్తులు ఎప్పుడూ ఇవ్వలేదన్నారు. కూలీల కోసం ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఉపయోగంలో లేదన్నారు. గడ్డపలుగుతో పని చేసే వారికి రూ.5 అదనంగా ఇచ్చే వారని మేట్‌కు ఒక్కో కూలి రూ.2 చొప్పున అదనంగా ఇచ్చేవారని చెప్పారు. పని ప్రదేశం దూరమైతే చార్జీలిచ్చేవారని తెలిపారు. మజ్జిగ, గుడారాల సౌకర్యం అమలు జరగటం లేదన్నారు. ఆరు వారాలుగా కూలీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నామమాత్రంగా ఉపాధి పనులను నిర్వహిస్తూ పథకం ప్రయోజనాన్ని, లక్ష్యాలను నీరుగార్చటం అన్యాయమని, ఈ పథకం నిర్వహణలో జరుగుతున్న లోపాలను సరిదిద్ది నిరుపేద కూలీలకు న్యాయం జరిగేలా చూడాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.దుర్గా కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సగ్గుర్తి కోటేశ్వరరావు, దిరిశనపు బుద్దాయ్, జమ్మి వెంకటేశ్వరరావు, పిల్లి వీరాస్వామి, గంగరాజు, ఎస్.రజని, దిరిశనపు భారతమ్మ,ఎస్.సంతోషం, మేడూరి నక్షత్రం, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో కనిపించిన నెలవంక

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలో నెలవంక కనిపించింది. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. మక్కా, మదీనాలో రాత్రి తరావీ నమాజ్ ఆచరిస్తారు. సౌదీ అరేబియాతో పాటు మరికొన్ని దేశాల్లో ఆదివారం నెలవంక కనిపించింది. అయితే 11-12 మధ్యరాత్రి నుంచి భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల్లో రంజాన్ ఉపవాసాలు మొదలవుతాయి. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు నెలవంక కనిపించిన తర్వాత రంజాన్ దీక్షలను ప్రారంభిస్తారు. ఈనెలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలను ఆచరిస్తారు. ఎక్కువగా దైవ ధ్యానంలో గడుపుతారు. 30 రోజుల పాటు ఉపావాసం ఉండి నెలాఖరులో రంజాన్ లేదా ఈద్ ఉల్ ఫితర్‌ను జరుపుకుంటారు.

వచ్చే ఏడాది చివరి కల్లా 'సముద్రయాన్'

కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: సముద్ర గర్భఅన్వేషణ కోసం భారత్ చేపడుతున్న తొలి మానవ సహిత డీప్ ఓషన్ మిషన్ 'సముద్రయాన్' ప్రాజెక్ట్‌ను వచ్చే ఏడాది చివరికల్లా చేపడతామని కేంద్ర భూ విజ్ఞానశాస్త్ర శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఇందులో భాగంగా శాస్త్రవేత్తల బృందం సముద్ర మట్టం నుంచి ఆరు వేల మీటర్ల లోతులోకి వెళ్లి పరిశోధన చేస్తుందని తెలిపారు. "సముద్రయాన్ కోసం 'మత్స్య' అనే జలాంతర్గామిని సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా ముగ్గురు శాస్త్ర వేత్తల బృందం సముద్ర జలాల్లో ఆరు వేల మీటర్ల లోతులోకి ప్రయాణిస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు తుది దశలో ఉన్నాయి. 2025 చివరికల్లా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తాం" అని మంత్రి తెలిపారు. సముద్ర జలాల్లోని వనరులు, జీవ వైవిధ్యంపై అధ్యయనం కోసం 2021లో కేంద్ర ప్రభుత్వం 'సముద్రయాన్' ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. మత్స్య జలాంతర్గామిని చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీలో తయారు చేస్తున్నారు. ఇందులో ఆధునిక సెన్సర్లు, టూల్స్ ఉంటాయి. ఇది 12 గంటలపాటు పని చేస్తుంది. అత్యవసర సమయాల్లో దీని సామర్థ్యాన్ని 96 గంటలకు పెంచవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ దేశాలు ఈ ప్రాజెక్టులను విజయవంతంగా చేపట్టాయి.

15న ఇద్దరు ఈసీల నియామకం

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషనర్లు ఇద్దరిని ఈనెల 15వ తేదీ నాటికి నియమించనున్నారు. అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ, అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామాతో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వేళ గోయల్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆయన శుక్రవారం రాజీనామాను సమర్పించగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీనిని ప్రకటించేందుకు నోటికేషన్‌ను న్యాయ శాఖ జారీచేసింది. పాండే 65వ పడిలోకి అడుగు పెట్టిన క్రమంలో ఫిబ్రవరి 14న పదవీ విరమణ పొందారు. న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ నేతృత్వ సెర్చ్ కమిటీలో హోంశాఖ, డీఓపీటీ శాఖ కార్యదర్శులు ఉన్నారు. ఈసీలో ఏర్పడిన ఖాళీలకు అర్హులైన ఐదుగురితో రెండు వేర్వేరు ప్యానళ్లు ఏర్పాటు చేస్తాయి. అనంతరం ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ... ఎన్నికల కమిషనర్లుగా నియామించేందుకు ఇద్దరి పేర్లు ప్రతిపాదిస్తుంది. ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తారు. ఈనెల 13న లేక 14న ఎంపిక కమిటీ భేటీ అవుతురిది. ఇదే క్రమంలో 15న నియామకాలు జరుగుతాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

కేంద్ర మంత్రి గిరిరాజ్‌కు నిరసన సెగ

నల్లజెండాలు చూపిన బీజేపీ కార్యకర్తలు

పాట్నా: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సొంత నియోజకవర్గంలో సొంత పార్టీ శ్రేణుల నుంచి భారీ నిరసన సెగ తగిలింది. బీహార్‌లోని బెగుసరాయ్ జిల్లాలో బీజేపీ కార్యకర్తలు నల్ల జెండాలు చూపించి నిరసన వ్యక్తం చేశారు. తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన బెగుసరాయ్‌పై గిరిరాజ్ సింగ్ దృష్టిసారించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు. ఆదివారం బరౌనిలో డెయిరీ ప్రారంభోత్సవ కార్యక్రమా నికి హాజరైన గిరిరాజ్ సింగ్ ఆ తర్వాత బచ్వాడలో ఒక ప్రారం భోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాన్వాయ్‌లో బయలు దేరారు. జాతీయ రహదారి 28లోని రాణి గ్రామ సమీపంలో బీజేపీ కార్యకర్తలు నిరసనకు దిగారు. నల్లజెండాలు చూపించి గిరిరాజ్ కాన్వాయ్‌ను చుట్టుముట్టారు. ఆయన అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. దీంతో కేంద్ర మంత్రి కాన్వాయ్ కొంతసేపు జాతీయ రహదారిపై నిలిచిపోయింది. స్పందించిన పోలీసులు నిరసనకు దిగిన బీజేపీ కార్యకర్తలను పక్కకు లాక్కెళ్లారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పెప్సీ ప్లాంట్‌లో బెగుసరాయ్ నుంచి ఎవరికీ ఉపాధి కల్పించలేదని నల్ల జెండాలతో నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

సీపీఐ నేతలు రామకృష్ణ, జల్లి విల్సన్‌కు ఎస్టీయూ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీలు తమ వైఖరిని తెలుపుతూ మేనిఫెస్టోలో చేర్చాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి కోరారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం ఉపాధ్యాయ వైజ్ఞానిక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నేతలు మాట్లాడుతూ, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని కోరారు. కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఆరు శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలన్నారు. ఇప్పటివరకు కేంద్ర బడ్జెట్‌లో మూడు శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 11-12 శాతం మించి కేటాయించడం లేదని వివరించారు. విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచేలా, పై సమస్యలన్నింటిపై మేనిఫెస్టోలో ప్రకటించాలన్నారు.

అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌ను పార్టీ కార్యాలయంలో ఎస్టీయూ నేతలు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌టీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసఫ్ సుధీర్ బాబు, ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.సురేశ్ బాబు, సుబ్రహ్మణ్యం రాజు, రామచంద్రయ్య, కేవీ రామచంద్రరావు, పి.రమణారెడ్డి, శివప్రసాద్, కడియాల మురళి, జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నెతన్యాహు చర్యలతో గాజా కంటే ఇజ్రాయిల్‌కే అధిక నష్టం: బైడెన్

వాషింగ్టన్: గాజాలో నెతన్యాహు చర్యల వల్ల గాజా కంటే ఇజ్రాయిల్‌కే అధిక నష్టం జరుగుతోందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. పలస్తీనియన్ల పరిస్థితి నేపథ్యంలో యూద దేశంపై వ్యతిరేకత పెరుగుతోందని, యావత్ ప్రపంచం వ్యతిరేకమవుతోందని తెలిపారు. గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ భీకరంగా సాగుతూ నిత్యం భారీగా ప్రాణ నష్టం సంభవిస్తుండటంతో ఇప్పటికే 31వేల మంది పలస్తీనియన్లు చనిపోయారు. కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ నిరాకరిస్తుండటం, కనీస మానవతా సాయం కూడా అందక పలస్తీనా ప్రజల పరిస్థితి దుర్భరమైంది. ఇప్పటికే ఆకలి చావులు సంభవిస్తున్నాయి. క్షుద్బాధతో పసి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో ఇప్పటివరకు ఇజ్రాయిల్‌ను వెనకేసుకొచ్చిన అమెరికా వైఖరిలో మార్పు కనిపించింది. నెతన్యాహు చర్యలతో ఇజ్రాయిల్‌కే అధిక నష్టం జరుగుతోందని బైడెన్ అన్నారు. 'ఇజ్రాయిల్‌ను పరిరక్షించే/సమర్థించే హక్కు నెతన్యాహుకు ఉంది. హమాస్‌పై పోరును కూడా కొనసాగించవచ్చు కానీ ఆయన తప్పనిసరిగా అమాయక ప్రజల ప్రాణాలను కాపాడాలి. పౌరులకు రక్షణ కల్పించడంపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. కానీ అలాంటిదేమీ జరగడం లేదు. పర్యవసానంగా ప్రాణ నష్టం భారీగా సంభవిస్తోంది' అని ఎంఎస్ఎన్‌బీసీ బ్రాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బైడెన్ అన్నారు. నెతన్యాహు తీసుకుంటున్న చర్యల వల్ల ఇజ్రాయిల్‌కు మేలు కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందన్నది తన అభిప్రాయమని చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ ఇజ్రాయిల్ వైఖరిని ఆక్షేపించడమే కాకుండా దాని పక్షాన్ని వ్యతిరేకిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితిని తెచ్చుకోవడం నెతన్యాహు ఘోర తప్పిదమని బైడెన్ అన్నారు. గాజాలో ఇజ్రాయిల్ చర్యలకు సంబంధించి వాషింగ్టన్‌కు 'రెడ్ లైన్' ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని, దానిని వదులుకోబోమని బైడెన్ తెలిపారు.

అమెరికా మేలు నాకు తెలుసు

అమెరికా ఏది మంచిది ఏది కాదన్నది తనకు తెలుసని బైడెన్ అన్నారు. తమ దేశపౌరులకు ఎలా మంచి చేయాలో బాగా తెలుసు అని చెప్పారు. అధ్యక్ష రేసులో పోటీకి బైడెన్ సిద్ధమైన క్రమంలో ఓ ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. 'నేను యువకుడిని కాదనడంలో రహస్యమేముంది. కోవిడ్ వేళ అమెరికాను సంక్షోభం నుంచి బయటకు తెచ్చాను. శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా మలిచాను. అమెరికా ప్రజల కోసం పోరాడటమే అధ్యక్షుడి బాధ్యతని నమ్మాను. అందుకు కట్టుబడ్డాను' అని బైడెన్ తెలిపారు. స్వలాభం, సొంత ప్రయోజనాలను చూసుకోవడమే అధ్యక్షుడి పని అనుకునేది నేను కాదు అని తన ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నుద్దేశించి జో బైడెన్ వ్యాఖ్యానించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.